ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 25 & 26 సంచిక : 11, 12 & 1 జూలై, ఆగష్టు, సెప్టెంబర్ 2020

# ప్రేమ స్వరూపులు మన నాన్నగారు

సేకరణ : బేబీ, హైదరాబాద్

"అజ్ఞాని మోహిస్తాడు, జ్ఞాని ప్రేమిస్తాడు. మోహం తిరిగి ఏదో ఒకటి అడుగుతుంది. మేము భగవంతుడిని ప్రేమిస్తున్నాము, మేము భక్తులము అని మీరు అనుకోవచ్చు. కానీ భగవంతుడే మిమ్మల్ని ప్రేమిస్తున్నాడు. భగవంతుడు మిమ్మల్ని ప్రేమించినా తిరిగి మీరు భగవంతుడిని ప్రేమించలేరు" అని ఒక సందర్భంలో శ్రీ నాన్నగారు అన్నారు. మన భగవంతుడు, సద్గురువు అయిన శ్రీ నాన్నగారి ప్రేమకి వారసులమైన మనము అదృష్టవంతులము. ఆయనకి భక్తుల పట్ల ఉన్న ప్రేమ, దయ; మనస్సుకి హత్తుకొనేలా బోధించే విధానంలో ఆప్యాయత,మనం అందుకోలేము. అది ఆయన మాటలలోనే వినాలి.

ముందుగా మన అమలాపురం మాష్టారు, చావలి సూర్యనారాయణ మూర్తిగారు శ్రీ నాన్నగారి వైభవంగురించి పూర్వం చెప్పిన మాటలు ఒకసారి తలుచుకుందాము.

"వ్యవహారికంగా జిన్నూరు గ్రామ నివాసి, పారమార్థికంగా హృదయవాసి అయిన సద్గురువు శ్రీ నాన్నగారు మన మధ్యే అతి సామాన్యంగా జీవిస్తూ, అనేక మంది భక్తుల ప్రేమాభిమానములను, గౌరవాన్ని చూరగొన్నారు. ఉత్కృష్టమైన ఆధ్యాత్మిక విషయాలను, దైనందిన జీవితానికి అన్వయించి, సరళముగా శ్రీ రమణతత్త్వాన్ని బోధిస్తూ, అంతిమ సత్యంలోకి మేల్కొల్పటం శ్రీ నాన్నగారి విశేష లక్షణం. భగవాన్ శ్రీ రమణమహర్షి యొక్క ప్రియభక్తుడు, జీవకోటి ప్రేమికుడు, సరళ వక్త, సద్గురువు, కర్మయోగి, మృదుభాషి, దయానిధి అయిన శ్రీ నాన్నగారు మన మధ్య ఉండటం మరియు మనము శ్రీ నాన్నగారితో

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 36

గౌరవ సంపాదకులు

శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రూ॥ 150/-

విడి ప్రతి : రూ॥ 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

9441122622

7780639977

ఈ సంచికలో....

24-11-1985, జిన్నూరు

అరుణాచల మహత్యం

శ్రీమద్భగవద్గీత

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

సన్నిహితంగా మసలటం అనేక జన్మల పుణ్య ఫలితమే! భగవాన్ శ్రీ రమణ మహర్షి బోధాసారము, ఆశయాలతో నిండిన శ్రీ నాన్నగారి విధానముమరియు బోధ ద్వారా అనేక మంది ఉద్ధరింపబడుతున్నారు. శ్రీ నాన్నగారి దైనందిన జీవితం చాలా సరళమైనది, క్రమబద్ధమైనది. అనేక ప్రాంతాలలో ప్రవచనాల ద్వారా మరియు రమణభాస్కర మాస పత్రిక ద్వారా జ్ఞానబోధను అందించుటయే కాక, ప్రతి రోజూ సంభాషణ ద్వారా తత్త్వబోధ చేసి భక్తుల సందేహాలను నివృత్తి చేస్తారు. భక్తులు శ్రీ నాన్నగారి చుట్టూ చేరి అత్యంత శ్రద్ధతో వారి నోటినుండి వెలువడే జ్ఞానముత్యాలను ఏరుకుంటారు. అట్టి సద్గురువు బోధను ఆచరణలో పెట్టి, మనమందరము తరించి శాంతి సామ్రాజ్యానికి వారసులం కావాలి."

## సద్గురు నాన్నగారికి భక్తుల పట్ల ప్రేమ, దయ ఆయన మాటలలో...

భౌతికంగా, ఆధ్యాత్మికంగా కూడా మీకు ఉదాత్తమైన భవిష్యత్తు, ఉజ్జ్వలమైన భవిష్యత్తు కోరుతూ నేను నిండు మనస్సుతో భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. మీ శ్రేయస్సులోనే నాకు శ్రేయస్సు ఉంది, మీ క్షేమంలోనే నా క్షేమం కూడా ఉంది. మీ సంతోషం నాకు సంతోషం, మీ దుఖం నాకు దుఖం. మీరు కొన్నిగంటల సేపు మౌనంగా చాలా ప్రశాంతంగా కూర్చొని ఈ సన్నివేశాలకు ఎంతో ఉన్నత స్థాయిని తీసుకొస్తున్నారు. నా ప్రసంగం కంటే మౌనం చాలా ముఖ్యమైనది. ఆది గురువు దక్షిణామూర్తి కూడా పరబ్రహ్మ స్వరూపాన్ని మాటలతో చెప్పలేక మౌనంతోటే చెప్పారు.

నేను మాటలు మాట్లాడుతూవుంటే మీకు దూరం అయిపోతున్నానేమో. మౌనంగా ఉంటే బహు దగ్గరగా బహు సన్నిహితంగా ఉన్నట్టు ఉంటుంది. మౌనంగా ఉంటే ఎడబాటు లేదు. మౌనానికి భాషతో పని లేదు.

నేను (నాన్నగారు) మీ అందరి ముందూ తల వంచి మీ పాదాలకి నమస్కారాలు చేసి చెపుతున్నాను - మీరు పదివేల రూపాయలు పెట్టి లక్షవత్తుల పూజలు చేసే కంటే ఈ మాటలు ఒక అరగంట సేపు వింటే చాలు, అంతకంటే ఎక్కువ ఫలితాన్ని మీరు పొందుతారు. నేను ఇలా చెపితే మీలో ఎంతమందికి అర్థం అవుతుంది? సాధ్యమైనంత వరకు మిమ్మల్ని నిజం దగ్గరకి తీసుకెళ్ళి పడేద్దామనే నా ఉద్దేశం కానీ నాకు భక్తి లేదని మీరెవరూ అనుకోవద్దు. భగవంతుడి మీద మీకెంత భక్తి ఉందో నాకూ అంతే భక్తి ఉంది; నా భక్తిని మీరెవరూ అనుమానించకండి.

భక్తి అంటే జీవితం నుంచి పారిపోవటం అని, జీవితానికి ఏమీ సంబంధం లేదని, మొద్దబ్బాయిలలా కూర్చోవటం అని అనుకొంటారు. దీనికి ఆలోచన తోటి పని లేదని ఇలా

అనుకొంటారు. చాలా పొరపాటు అభిప్రాయం అది. మిమ్మల్ని వివేకవంతులని చెయ్యటం కోసం ఈ మాటలు చెపుతున్నాను కానీ మిమ్మల్ని బానిసలని చెయ్యటం కోసం చెప్పటం లేదు.

నేను మాటలు చెపుతున్నాను. ఈమాటల బరువు మీలో ఎంతమందికి తెలుసు? నేను మాటలు చెప్పాలని మీరు అందరూ సరదా పడుతున్నారు, ఏవో నాలుగు మాటలు చెపుతున్నాను. ఈ మాటలకి బరువు ఎంతుందో మీరేం చూస్తున్నారు?

ధ్యానం చేస్తున్నారు కానీ ధ్యానం చేసేవాడిని ఎప్పుడైనా చూసారా మీరు? ముందు మన ఇంట్లో గొడవలు మనకి తెలియటం లేదు. వీధిలో గొడవలు ఎందుకు మీకు? మీలో పూజ చేసేవాడు, ధ్యానం చెయ్యాలి అనుకొనేవాడు ఎవడు? వాడి గురించి ఎప్పుడైనా ఆలోచించారా మీరు? లోపల అవిద్య అజ్ఞానం ఉన్నాయి, వాటిని మాయ అంటున్నారు. లోపల ఉన్న దాని మాట ఏమిటి అని మీలో ఎవరికైనా ఆలోచన కలిగిందా? పురాణాలు, గీత వింటున్నారు; భగవాన్ గురించి, రామకృష్ణుడి గురించి వింటున్నారు; రైటే, లోపల ఉన్న అజ్ఞానం కదిలిందా?

కీర్తి ఓడిపోతుంది, చదువు ఓడిపోతుంది, అన్నీ ఓడిపోతాయి, ఒక్క ప్రేమకే ఓటమి లేదు. విద్యా దానం కంటే జ్ఞాన దానం గొప్పది. జ్ఞానాన్ని ప్రసాదించే వాడే సద్గురువు. మీరు పూజలు చెయ్యండి, ధ్యానాలు చెయ్యండి అని పుస్తకాల నిండా రాసివున్నాయి, గురువులు అందరూ చెపుతున్నారు. మీకు ఇష్టం అయితే మీరు అవన్నీ చేసుకోండి. కానీ ఆ బరువు కూడా మీమీద పెట్టడం నాకు ఇష్టం లేదు. జపాలు చేసినా, ధ్యానాలు చేసినా, మనస్సు చల్లబడటానికే కదా! వీటితోటి నిమిత్తం లేకుండా మీ మనస్సు చల్లబడతావుంటే, వీటితోటి పని ఏముంది మీకు? నన్ను చూడగానే మీ మనస్సు ఆత్మ వైపు తిరగకపోతే, మీకు శాంతి రాకపోతే నేను పవిత్రుడిని కాదు.

మీలో ఎవరినైనా హృదయపూర్వకంగా నేను స్మరిస్తే, నేను స్మరించిన వెంటనే మీకు శాంతి కనుక రాకపోతే నేను పవిత్రుడినే కాదు! దేహం లేని స్థితికి, లోకం లేని స్థితికి, అహంకారం లేని స్థితికి ప్రయాణం ప్రారంభిస్తున్నారు మీరు. మీకు ప్రేమ లేకపోతే, ప్రేమ కలగచేసే భాధ్యత కూడా నాదే! దానికి కూడా మీరు కష్టపడక్కరలేదు. ఈశ్వరుడిని మీరు ప్రేమించాలి కానీ ఆ ప్రేమ మీలో లేనప్పుడు ఎక్కడ నుంచి ప్రేమిస్తారు మీరు ఈశ్వరుడిని. ఆ ప్రేమ మీలో కలగచేసే భాధ్యత కూడా నాదే.

మీ చేత మననం చేయించటం కూడా నాకు ఇష్టం లేదు; శ్రవణమే చాలు. మీరు

ఇంటికి వెళ్లి మననం చెయ్యండి అనే మాటలు కూడా నేను అనను. రాముడు జ్ఞాని, కృష్ణుడు జ్ఞాని, రమణుడు జ్ఞాని, ఇటువంటి మాటలు చెప్పటానికి నేను ఇంత దూరం రావాలా? మీరు ఇంత దూరం వచ్చి కూర్చోవాలా? ఆవు బొమ్మ వేసి కింద ఆవు అని రాస్తేనే కానీ తెలియదా మనకి? మనం అందరం అన్నం తింటున్నాము. అన్నం ఒక్కటే సరిపోతుందా, ఇంకేం అక్కరలేదా మనకి?

మీకు బోలెడు పనులు ఉన్నాయి ఇంటి దగ్గర. నాకేంటి, ఇలా సాయంత్రం వరకు మాట్లాడినా మాట్లాడతాను. నేను పని లేని వాడిని. మీరందరూ పని వున్నవాళ్ళు, మీకు బాధ్యతలు ఉన్నాయి. ఇంటికి వెళ్లి అవి సవరించుకోవాలి కదా. నన్ను చూస్తే మీకు జాలి పడాలని ఉంటే జాలి పడండి, కానీ అసూయ పెట్టుకోకండి. మీకెవరికీ అసూయ లేదు; మీరందరూ చాలా మంచివాళ్ళు. మంచి చేసిన వాళ్లకి దుర్గతి లేదు అని భగవంతుడు చెప్పాడు.

మీ అందరినీ ప్రేమిస్తున్నాను, మీ అందరి శ్రేయస్సు కోరుతున్నాను. ఇందులో మట్టుకు కపటం ఏమీ లేదు. నాలో ఉన్న ఈ ఒక్క చిన్న మంచి గుణానికి నాకు జ్ఞానం ఇస్తూంటే, మీలో ఎన్నో పెద్ద పెద్ద మంచి గుణాలు ఉన్నాయి, ఇంక మీకేంటి!

మీలో ఎవరికైనా దుఖం ఉంటే అందులో నాకు వాటా పెట్టండి, మీ సుఖం నాకు అక్కరలేదు. మీరు పని చేసుకొంటున్నా, పని చేసుకోకపోయినా, మీరు వ్యవహారంలో ఉన్నా వ్యవహారంలో లేకపోయినా నిరంతరమూ సమాధిస్థితిలో ఉండాలి. ఏదో పది నిమిషాలు ముక్కు మూసుకొని కూర్చోవటం కాదు. మీరు పని చేసుకొంటున్నా సమాధిలో ఉన్నట్టు ఉండాలి. ఒకవేళ వెదికి పట్టుకుందామన్నా మీకు దుఖం కనపడకూడదు. సూర్యుడికి చీకటి ఎంత దూరంగా ఉంటుందో, జ్ఞానికి దుఖం అంత దూరంగా ఉంటుంది.

చివరి కోరిక ఏంటంటే, మనమందరం జ్ఞానంలో ఎదగాలి. శరీరం మన ప్రయత్నం లేకుండానే ఎదుగుతోంది, దానికి ప్రయత్నం అక్కరలేదు. స్మశానంలోకి వెళ్ళటానికి ప్రయత్నం అక్కరలేదు. మనం జ్ఞానంలో ఎదగాలి. జ్ఞానంలో ఎదగాలంటే ప్రకృతితోటి పోరాటం ఉంటుంది. ప్రకృతితోటి ఎవడైతే పోరాడలేదో వాడు జ్ఞానంలో ఎదగలేడు. ఎవడైతే ప్రకృతితోటి పోరాడుతున్నాడో వాడు జ్ఞానంలో ఎదుగుతాడు. సర్విచెట్లు ఎలా అయితే ఎదుగుతున్నాయో, ఎంత పొడవుగా ఉన్నాయో, అదేవిధంగా జ్ఞానంలో మనం అంత బాగా ఎదగాలి. మనం జ్ఞానం సంపాదించటం కోసం జన్మించాం, అందుకే జీవించాలి, జ్ఞానం సంపాదించే ప్రయత్నంలోనే మరణించాలి. ముఖానికి కాంతి జ్ఞానమే, ముఖానికి సౌందర్యం జ్ఞానమే, జ్ఞానం లేని ముఖంలో ఏముంది చూడటానికి!

# గురువు చేసే పని

"మనుష్యత్వం ముముక్షత్వం మహాపురుషసంశ్రయః" - వివేకచూడామణిలో ఆచార్యులు వారు ఇవి మూడు దుర్లభం అన్నారని చాలా సందర్భాలలో నాన్నగారు మనకి చెప్పారు. మానవ జన్మ రావటం, ఆత్మ జ్ఞానం పొందాలని కాంక్ష కలగటం, సత్పురుష సహవాసం దొరకటం, ఒకటికి మించి ఒకటి కష్టం; దీనికి ఎంతో పుణ్యబలం ఉండాలి. మొదటి రెండూ ఉన్నప్పటికీ, సత్పురుష సహవాసం మాత్రం ఈశ్వరానుగ్రహం, గురువు అనుగ్రహం లేకుండా లభించదు. సద్గురువు శ్రీ నాన్నగారు మన జీవితాలలో ప్రవేశించి మనల్ని పునీతుల్ని చేసారు. మనకి లభించిన ఈ అనుగ్రహం సామాన్యం కాదు. గురువు చేసే పనిని (అంటే నాన్నగారు చేసే పని) చాలావిపులంగా ఆయనే చెప్పారు మనకి. శ్రీ నాన్నగారు మనకి చేసే ఉపకారం, వెలకట్టలేనిది; ఆ విలువ ఎంతో చెప్పటానికి,ఆయన చెప్పిన మాటలు కూడా సరిపోవేమో...

గురువు అంటే ఆత్మ; గురువు అంటే చైతన్యం. దేవతలు అందరూ చేసే పని గురువే చేస్తాడు. బ్రహ్మ చేసే పని, విష్ణువు చేసే పని, శివుడు చేసే పని గురువే చేస్తాడు. ఒకవేళ ఎప్పుడైనా భగవంతుడికి కోపం వస్తే మనకు అపాయం రాకుండా ఆ కోపాన్ని గురువే మింగేస్తాడు. అంటే మనకి ప్రొటెక్షన్ యిస్తాడు (మనని కాపాడతాడు). అనేక జన్మల నుంచి నీవు భగవంతుడిని ఆరాధించగా ఆరాధించగా, ధ్యానించగా ధ్యానించగా, మోక్షానుభవం పొందాలి అనే దృఢసంకల్పంతో నీవు ప్రయత్నం చేస్తూ ఉంటే భగవంతుడే ఒక రూపం దాల్చి గురువుగా నిన్ను గైడ్ చేస్తాడు. గురువు మాట్లాడేటప్పుడు పని ఉండి మాట్లాడటం కాదు, కేవలం దయ వలన మాట్లాడతాడు. గురువు నోటి నుండి వచ్చే మాటే దయ, ఆ మాటే జ్ఞానం, ఆ మాటలోనే ప్రేమ ఉంది - అది గ్రహించిన వాడు ధన్యుడు.

అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడే, ఆ చైతన్యమే,భక్తుడి పట్ల జాలితో, భక్తుడిని పరిపక్వానికి తీసుకొని రావటం కోసం ఒక మానవరూపం ధరించి వస్తాడు, వాడు గురువు. మనలో అంతర్యామిగా ఉన్న ఆత్మే, చైతన్యమే, నిజమైన గురువు. బయటి గురువు మనకు బోధిస్తాడు, మనలను లోపలికి నెట్టటానికి ప్రయత్నం చేస్తాడు. లోపల గురువు మనలను లోపలికి గుంజుకొని, జీవలక్షణాలను తొలిగించి మనలను పవిత్రం చేసి, పక్వం చేసి, తన స్వరూపాన్ని మనకు ఇస్తాడు. అదే ఆత్మస్వరూపం. అదేజ్ఞాన స్వరూపం అదే సుఖస్వరూపం, అదే శాంతిస్వరూపం. ఆ సుఖం నీకు అనుభవంలోకి వచ్చినప్పుడు దేవుడు వచ్చి ఎదురుగా నిలబడినా నీకు చూడాలని అనిపించదు. అది గౌరవం లేకపోవటం

వలన కాదు, అవసరం లేక. ఆత్మానందంలో ఊగిసలాడుతున్న జీవుడికి శరీరంతో పని లేదు, లోకంతో పనిలేదు, దేవుడితో పనిలేదు, వాడికి ఎటుచూసినా ఆనందమే, ఎటు చూసినా శాంతే.

గురువు నీతో సరదాగా మాట్లాడుతూ ఉంటాడు. ఏమిటి బాగున్నావా అంటాడు, పంటలు బాగా పండుతున్నాయా అంటాడు. ఇవన్నీ కూడా నిన్ను లోపలికి తీసుకొని పోవటానికే చేస్తాడు. మధ్య మధ్యన ఆత్మ గురించి బోధిస్తాడు. మీ యోగక్షేమాలు అడుగుతూ ఉంటాడు. అలా మీతో మాట్లాడుతూ మిమ్మల్ని హృదయం యొక్క లోయలలోనికి నెట్టుకొనిపోతూ ఉంటాడు. సర్జరీ చేస్తున్నట్లు మీకు తెలియనివ్వడు. మీ బట్ట నలగనివ్వడు, మీ ముఖానికి రాసుకున్న పౌడరు కూడా చెరగనివ్వడు. మీకు ఏమీ ఇబ్బంది లేకుండా, పెద్ద బాధ లేకుండా,లోపల ఆ సర్జరీ ప్రక్రియను పూర్తి చేసి మీకు మోక్షాన్ని ప్రసాదిస్తాడు, వాడు గురువు.

నిన్ను హృదయంలోకి నెట్టుతూ ఉన్నప్పుడు నీ బలహీనతలు, నీ అలవాట్లు అడ్డు వస్తూ ఉంటాయి. జన్మాంతరము నుండి వచ్చే వాసనలు అనే బండరాళ్ళను నీవు గెంటలేవు. నీ చేత ఏదో చిన్న ప్రయత్నం చేయించి, ఏదో వంపు పెట్టి ఆ రాళ్ళను ఆయనే గెంటేస్తాడు. సాధన చేసి వాటిని గెంటేసాను అని నీవు అనుకుంటావు. కాని నీకు తెలియకుండా వాటిని ఆయనే గెంటేస్తాడు. ఆ రాళ్ళను ఆయనే గెంటుతున్నప్పటికీ, నువ్వే గెంటుతున్నట్లుగా నీకు అనిపింపజేసి, నిన్ను అనుగ్రహించి, నీకు ఆత్మజ్ఞానాన్ని ప్రసాదిస్తాడు, వాడు గురువు. గురువు వలన నాకు ఈ సహాయం వస్తోంది అని, నీవు అనుకోవాలి అని ఆయన అనుకోడు.

నీ బుద్ధిలో వంకరలు ఉన్నాయి అని గురువు నీకు చెప్పడు, వాటిని తొలిగించటానికి చూస్తాడు. అప్పుడు నీకు భయం వేస్తోంది అనుకో, ఆ భయాన్ని నెమ్మదిగా తొలగించి నీకు ఆత్మవిశ్వాసం కలగజేస్తాడు. ప్రపంచం అంతా నీకు వ్యతిరేకముగా ఉన్నప్పటికీ, ఒంటరిగా నీ కాళ్ళ మీద నీవు నిలబడేటట్లు చేస్తాడు. భయంలోంచి భయరహిత స్థితికి తీసుకొని పోయేటప్పుడు ఆ ప్రక్రియ నీకు తెలియనివ్వడు. ఏమిటి ఇంత ధైర్యం వచ్చేసింది అనుకుంటావు.

బాహ్యమైన చీకటిని సూర్యుడు ఎలా పోగొడుతున్నాడో అలాగ లోపల ఉన్న అజ్ఞానం అనే చీకటిని గురువు పోగొడతాడు. మనలో అంతర్యామిగా ఉండి, హృదయగుహలోనికి ప్రవేశించటానికి, మనకు ఏవైతే ఆటంకాలు ఉన్నాయో, వాటినిక్లియర్ చేస్తూ ఉంటాడు. బోయవాడు జంతువుని ఎలా వెంటాడి వేటాడతాడో అలాగ నీవు హృదయగుహ లోనికి చేరే వరకూ, నీకు అమృతానుభవం కలిగే వరకూ జన్మజన్మలకూ గురువు నిన్ను వెంటాడతాడు.

నీవు ఇంకొక జన్మలో మరో శరీరం దరించవచ్చు, కాని నువ్వు ఎక్కడ జన్మించావో గురువు చూసుకొంటూ ఉంటాడు. గురువు రూపరహితుడు, నామరహితుడు, దేహం ఉన్నా దేహ రహితుడు. అందుచేత దేహం పోయినా గురువుతో సంబంధం తెగదు. నీకు ఏది మంచిదో అది నీ చేత చేయించుకొంటూ పోతాడు. అలాగ చెయ్యి, ఇలాగ చెయ్యి, డైరెక్షన్ చూసుకో అని చెప్పడు. ఆయనే డైరెక్షన్ చూసుకొంటూ నీ చేయి పట్టుకొని హృదయగుహలోనికి తీసుకొని పోతాడు. వాడు గురువు.

గురువు నీ వ్యాపకాలను పెంచడు, నీ వ్యాపకాలలో నుండి, ఆందోళనలో నుండి నిన్ను విడుదల చేస్తాడు. మనం ఒకోసారి, మాటలతో వర్ణించలేని, మనస్సుతో ఊహించలేని శాంతిసాగరంలో ఆనందసాగరంలో ఊగిసలాడుతూ ఉంటాము. ఇది మనం చేసే సాధన వలన వచ్చేసింది అని మనకు అనిపిస్తూ ఉంటుంది. కాని ఇది గురువు దయ వలన మనకు వచ్చింది అని గ్రహించినవాడు ధన్యుడు. మనకు ఆనందం అందుతూ ఉంటే, ఏదో కష్టపడి సాధన చేసాము, మన ఇంటికి మనం చేరుకున్నాము,అందుచేతనే ఇంత ఆనందంలో ఉన్నాము అనుకొంటాము. కాని మన ఇంటికి మనలను తీసుకొనివచ్చింది మన గురువే అన్న సంగతి మనం మరిచిపోతాము. మనం మరిచిపోయినా, గురువు మన దగ్గర నుంచి కృతజ్ఞత ఏమీ ఆశించడు.

గురువు నీలో అంతర్యామిగా ఉన్నాడు కాబట్టి, మోక్షం పొందటానికి నీకు ఏవైతే ఆటంకాలుగా ఉన్నాయో నీకంటే ఆయనకే బాగా తెలుసు. ఆ ఆటంకాలు అన్నింటినీ నాచురల్‌గా, నార్మల్‌గా తొలిగించి, నీ నిజమైన ఇల్లు అయిన మోక్షానికి నిన్ను తీసుకొని వెళ్ళేవరకూ నిన్ను విడిచిపెట్టడు. దారిలో నీకు అనేక ఇబ్బందులు రావచ్చు. ఆ ఇబ్బందుల వలన వచ్చే బాధలు కూడా నీకు తెలియకుండా చెయ్యి పట్టుకొని నీ ఇంటికి నిన్ను తీసుకొని పోతాడు. నీకు ఉన్న సమస్యలను బాధలను వ్యాపకాలను పెంచేవాడు గురువు కాదు. నీకు ఉన్న సమస్యలను, వ్యాపకాలను, మానసిక రోగాలను తగ్గించి,ఏవి పోతే నీకు లోపల ఉన్న వస్తువు స్వరూపముగా వ్యక్తమవుతుందో వాటిని ఆయనే తొలిగించి, సాధకుడికి, భక్తుడికి, ఏది ఉపకారమో, ఏ రకంగా పని చేస్తే అతనికి మేలు జరుగుతుందో ఆ రకంగా రెస్ట్‌లెస్‌గా పనిచేసుకుంటూ పోతాడు. వాడే నిజమైన గురువు. అజ్ఞానం అనే నిద్రలో నుండి మనలను మేల్కొల్పటానికి ఎప్పుడు, ఎక్కడ, ఏమి చెయ్యాలి, అది ఎలా చెయ్యాలి, అని ఆయన చూసుకొంటూ ఉంటాడు. ఆనందసముద్రం నీ హృదయంలో ఉంది. నీవు అందులో మునకలు వేయటానికి అడ్డు వస్తున్న బలహీనతలను గురువు తొలిగించి, నీ లోపల ఉన్న

ఆనందసముద్రంలో నీవు ఈదులాడటానికి సహాయ సహకారాలు అందిస్తాడు.

నిన్ను చీకటిలో నుంచి వెలుతురులోనికి, అజ్ఞానంలో నుండి జ్ఞానంలోనికి, మృత్యువులో నుండి అమృతత్వములోనికి తీసుకొని వచ్చేవాడే గురువు. ఎవరి సమక్షంలో నీ ఇంద్రియాలు మనస్సు అణిగిపోతాయో, ఎవరి సన్నిధిలో నీవు శాంతి తరంగాలలో కాంతి తరంగాలలో ఈదులాడుతూ ఉంటావో, ఎవరి సన్నిధిలో నీకు తెలియకుండానే నీ మనస్సుకు లోచూపు కలుగుతుందో వాడే నీ గురువు.

ధ్యానం చేసేటప్పుడు నీ గురువు ఎవరో నీకు లోపలినుండి తెలుస్తుంది. కాలాన్ని జయింప చేసేవాడు, కామాన్ని జయింప చేసేవాడు గురువు. ఆయన అనుగ్రహం లేకుండా మనం ఆయనను పొందటం సాధ్యం కాదు. నీలో ఎంతోకొంత భక్తి ఉంటే, ఆపిందిని పండు చెయ్యటానికి, నీలో ఉన్న వ్యక్తిభావనను తగ్గించటానికి, అహంభావరహిత స్థితిని నీచేత పొందింపచేయటానికి ఈ కాలం ఆ కాలం అనకుండా గురువు ఎల్లప్పుడూ నీకు సహాయ సహకారాలు అందిస్తాడు. నీకు అర్హత యోగ్యత ఉంటే, కేవలం నీ ఒక్కడి కోసం ఈశ్వరుడు గురురూపంలో వస్తాడు. గురువుకు శరీరంతో పనిలేదు. నీకు రూపదృష్టి ఉంది కాబట్టి, నీ కళ్లకు కనిపించటం కోసం ఒక రూపాన్ని ధరిస్తాడు. గురువు ఈశ్వరుడు వేరు కాదు. నీకు బోధించి ఆయనలో ఐక్యం చేసుకోవటానికి ఈశ్వరుడే గురురూపం ధరించి నీ ముందుకు వస్తాడు.

గురువు యొక్క శరీరం ఖర్మ అనుభవించటానికి రాలేదు. ఆనందంలో నాని నాని, ఉబికి ఉబికి, శిష్యుడిని ఉద్ధరించటానికి, ఆనందతాండవంలో శరీరం ధరించాడు; కాబట్టి వాడి శరీరం కూడా ఆనందమే.అందుచేత ఆయనను చూసేటప్పటికి మనకు కూడా ఆనందం కలుగుతుంది.గురువు యొక్క శరీరం ఆనందంలో వచ్చింది,మరల ఆనందంలోనే ఆ శరీరం అదృశ్యం అవుతుంది. మనకి దుఃఖం పంచిపెట్టటానికి గురువు రాలేదు, ఆనందం పంచిపెట్టటానికే వచ్చాడు. ఆనందాన్ని శాంతిని జ్ఞానాన్ని మనతో పంచుకోవటానికిగురువు వచ్చాడు.అందుచేత ఆయన శరీరం కూడా ఆనందమే, శాంతే, చైతన్యమే.

మన జీవలక్షణాలను పోగొట్టటానికి చైతన్యమే రూపం ధరించి వచ్చింది. మీకు అర్హత యోగ్యత లేకపోతే వాటిని మీకు కలుగజేస్తాడు కానిబయటికి వెళ్లిపో అనడు. నీ హృదయాన్ని విశాలం చేస్తాడు. ఆ పని అంతా ఆయనే పూర్తి చేసి నీతో ఏదో మాట్లాడుతూ ఏవో కబుర్లు చెపుతూ నీకు తెలియకుండానే నిన్ను ఆయనలో ఐక్యం చేసుకొంటాడు. బాగా పక్వానికి వచ్చిన జీవులను శరీరం ధరించక్కరలేకుండానే లోపల జ్యోతి రూపంలో

దర్శనమిచ్చి లోపలినుండే గైడెన్స్ ఇచ్చి లోపలకు గుంజుకొని ఆయన స్వరూపాన్ని ఇస్తాడు. నీకు రూపబుద్ధి లేనప్పుడు, రూపంతో పని లేకుండా లోపలినుండే సర్జరీ చేసి నీకు శాంతిని జ్ఞానాన్ని అనుగ్రహిస్తాడు.

గురువు ఓర్పుగా ఉంటాడు, శాంతిగా ఉంటాడు. గురువు యొక్క ఓర్పుకు హద్దులు ఉండవు. సూదంటురాయి ఇనుమును ఆకర్షించినట్టు తన మాటతో, తన చూపుతో భక్తుడిని ఆకర్షించుకోవటమే కాదు, వాడిని పవిత్రుడిని చేసి తన స్వరూపాన్ని ఇస్తాడు.

గురువు ఎంతటి వాడో ఇప్పుడు నీకు తెలియదు. నువ్వు ఎవడవో నీకు తెలిసాక, నీ స్వరూపం నీకు తెలిసాక, అప్పుడు గురువు యొక్క వైభవం, విశిష్టత నీకు తెలుస్తుంది. అప్పటివరకు గురువు అంతటి వాడు ఇంతటి వాడు అని నోటితోటి చెప్పినా, నీ మనస్సుతో ఊహించినా, గురువు యొక్క ఔన్నత్యాన్ని నీవు గుర్తించలేవు. అప్పుడు అన్ని జీవరాసులలో నీ గురువునే చూడటం నేర్చుకునే పరిస్థితిని కల్పిస్తాడు. అప్పుడు నీకు ఎటు చూసినా గురువే కనిపిస్తాడు.

ఒకో సారి గురువు నీ కోసం రూపం ధరించడు. నీ జిజ్ఞాస నిజమైతే, తగిన అర్హత నీకు వస్తే నీ లోపల నుండే గైడెన్స్ ఇచ్చి, జీవలక్షణాలను తొలిగించి చైతన్య స్రవంతిలో నిన్ను కలిపేస్తాడు. నీ రూపబుద్ధి, నామబుద్ధి నుంచి నిన్ను విడుదల చేసి నిన్ను మోక్షసామ్రాజ్యానికి అధిపతిని చేస్తాడు.

ఎవరైనా చిన్న సహాయం చేస్తే జీవితం పొడుగునా ఎంతో కృతజ్ఞత చూపిస్తున్నాము కదా, మరి నీ హృదయములో ప్రవేశించటానికి అడ్డుగా ఉన్న బండరాళ్లని పెకిలించి, బయటకు లాగి, నీ లోపల ఉన్న అంధకారాన్ని ఆయన దయతో బయటకు నెట్టి, నిన్ను అజ్ఞానం లోనుంచి, బంధంలోనుంచి, విడుదల చేసే గురువుకు నువ్వు ఎంత కృతజ్ఞత చూపించాలి!

**ధ్యానమూలం గురోర్మూర్తిం, పూజామూలం గురుపదం, మంత్రమూలం గురోర్వాక్యం, మోక్షమూలం గురుకృపః!**

**బ్రహ్మానందం పరమసుఖదం కేవలం జ్ఞానమూర్తిం**
**ద్వంద్వాతీతం గగన సదృశం తత్త్వమస్యాదిలక్ష్యం ।**
**ఏకం నిత్యం విమలమచలం సర్వధీసాక్షిభూతం**
**భావాతీతం త్రిగుణరహితం సద్గురుం తం నమామి ॥**



ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 24 నవంబర్ 1985, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

చెడ్డగుణాలకు దూరంగా ఉండండి, మంచిగుణాలను అలవర్చుకోండి అని చెపుతారు. చెడ్డగుణాలు ఎందుకు ఉండకూడదు? మంచిగుణాలే ఎందుకు ఉండాలి? అంటే మంచిగుణాలు ఉన్న వ్యక్తి బంధం నుండి విడుదల పొందుతాడు. చెడ్డగుణాలు ఉన్న వ్యక్తి ఆరోజుకారోజు, ఆజన్మకాజన్మ బంధంలో పడిపోతాడు. మనకు ఉన్న రూపాయలు సంపద కాదు. సద్గుణాలే సంపద. మన శరీరం పడిపోయినప్పుడు మన దగ్గర ఉన్న రూపాయలు మన శవాన్ని గడప దాకా కూడా సాగనంపవు. మన దగ్గర చాలా రూపాయలు ఉన్నాయి అనుకోండి, అయ్యో మనల్ని కష్టపడి సంపాదించి పెట్టిలో పెట్టాడు. వీడు వెళ్ళిపోతున్నాడు అని గడప దాకా కూడా రావు. గుణాలు ఏమి చేస్తాయి అంటే, మన ప్రాణం పోయినప్పుడు అవి మనస్సులో అణిగిపోయి ఉంటాయి. మీ శరీరం పడిపోయినా, మీ రూపాయలు పడిపోయినా, మీ ఇంద్రియాలు పడిపోయినా, ఎన్ని పడిపోయినప్పటికీ మీ మనసులో ఉన్న మంచిగుణాలే నిజమైన ఆస్తి. ఇవి మనసులో నిద్రాణం అయి, మళ్ళీ కొత్త శరీరం వచ్చేటప్పటికి ఇవి కూడా వస్తాయి. రూపాయలు రావు, గుణాలు వస్తాయి. అందుకే ఇది నిజమైన సంపద. మీరు కష్టపడి మంచిగుణాలు సంపాదించుకున్నారు అనుకోండి, ఆ మంచిగుణం నీ కూడా వస్తూ ఉంటుంది మీరు ప్రయాణం చేసినంతకాలం. ఎండలు తీవ్రంగా ఉన్నప్పుడు మనకు గొడుగు ఏ విధంగా అయితే రక్షణో, వర్షం కురుస్తునప్పుడు గొడుగు ఏ విధంగా అయితే రక్షణో, మీ మంచిగుణాలే మీకు రక్షణగా ఉండి, జన్మజన్మలకి మీకూడా వస్తాయి. మీరు చావు గురించి ఏమీ ఆలోచించకండి. చావు అనేది చాలా స్వల్ప విషయం, అల్ప విషయం. మీరు అహంకారం గురించి, మీ

మనసు గురించి ఆలోచించండి. చావు గురించి మీరు ఆలోచించి ఒక్క సెకను కూడా టైం వేస్ట్ చెయ్యద్దు. చావు అంటే ఏమీ లేదు మనం ఇలాగే ఉంటాం. మీరు బాగా గుర్తుపెట్టుకోండి. చావు వల్ల మన గుణాలు మారవు, మన అహంకారం మారదు, మన మనస్సు మారదు. మనం మన లాగే ఉంటాం. మరణం అంటే ఏమి లేదు, అహంకారం, అహంకారం లానే ఉంటుంది. ఈ శరీరం పడిపోతుంది, దానికి కొత్త శరీరం ఏర్పడుతుంది. ఆత్మకి శరీరం అక్కర్లేదు. అహంకారానికి శరీరం కావాలి. అందుచేత అహంకారం ఉంది కాబట్టి జన్మలు వస్తాయి. ఇది మీరు బాగా అర్థం చేసుకోవాలి. మీరు ఎంత ఎక్కువ అర్థం చేసుకుంటే, అంత తక్కువ సాధన తోటి మీకు ఫలితం వస్తుంది.

అహంకారం రాలిపోయే వరకూ ఈ సంసారాలు వస్తూ ఉంటాయి, ఈ లోకాలు వస్తూ ఉంటాయి. మీ శరీరం ఇవాళ ఇక్కడ కనిపించవచ్చు. మీ అహంకారానికి కొత్త శరీరం వచ్చినప్పుడు అది ఢిల్లీలో కనిపించవచ్చు. ఇంకో శరీరం వస్తుంది అనుకోండి అది రష్యాలో కనిపించవచ్చు. దేశం మారవచ్చు. కాలమాన పరిస్థితులు మారవచ్చు. కాని అహంకారం మారదు. అది నశిస్తేనే కాని నీకు జ్ఞానం కలగదు. అయితే మరణం వల్ల మనకు ఏమి మారుతోంది? మన అహంకారం మారటం లేదు, గుణాలు మారటం లేదు, మనస్సు మారటం లేదు. ఇప్పుడే వాటిని మార్చుకోవాలి. మరణం రాకముందే మరణించాలి వాడు జ్ఞాని అవుతాడు. ఎందుచేత? మరణం వల్ల శరీరం మారుతుంది, కాని గుణాలు మారవు. అహంకారం మారదు. ఒక్క శరీరమే మారుతుంది. ఆ శరీరం పడిపోయిన తరువాత దానికొక కొత్త శరీరం వచ్చి అటాచ్ అవుతుంది. దేనికి? అహంకారానికి. అది అలానే ఉంటుంది. అందుచేత చావు గురించి ఇంక ఆలోచించటం ఎందుకు? చావు గురించి భయపడవలసిన పని లేదు. మనసు మనకు ఎంత స్వాధీనంలోకి వస్తోంది, ఎంత మనం నిగ్రహించుకోగలుగుతున్నాము, మన అహంకారం ఎంతవరకు కంట్రోల్‌లో ఉంటోంది, దానిని ఎంతవరకూ బాలన్స్ చెయ్యగలుగుతున్నాము అని మీరు జాగ్రత్తగా చూసుకుంటూ సరిగ్గా మరణం వచ్చే టైముకి మీరు పెర్ఫెక్ట్‌గా మీ మనసుని మీరు స్వాధీనంలోకి తెచ్చుకుంటే మీరు సక్సెస్ అవుతారు. తరువాత ఇంక ఎవరు సాధన చెయ్యనక్కరలేదు. దేహం పడిపోక ముందే మన అహంకారం మన స్వాధీనంలోకి రావాలి, మన మనస్సు, మన ఇంద్రియాలు మన స్వాధీనంలోకి రావాలి, దానికి మనం ప్రిపేర్ అవ్వాలి. సర్వ సాధారణంగా ఈ మాటలు చెప్పుకోవటానికి తేలికగా ఉంటాయి. ప్రాక్టీస్‌కి వచ్చేటప్పటికి, ఆచరణకి వచ్చేటప్పటికి, చాలా కష్టం.

మీరు ఎదుటి మనిషిని అవమానం చెయ్యటానికి ప్రయత్నం చేస్తున్నప్పటికీ, వాడిని అవమానం చేసినప్పటికీ, వాడిలో గనుక ఏమీ వికారం పుట్టకుండా ఉంటే వాడు ప్రజ్ఞావంతుడు.

ఇక్కడ భగవంతుడు చూపించింది వండర్‌ఫుల్ లాజిక్. మీకున్న రాగద్వేషాలు బట్టి, మీకున్న ఇష్టా ఇష్టాలు బట్టి, మీకున్న కోప తాపాలు బట్టి ఎదుటి మనిషిని మీరు అవమానం చెయ్యటానికి ప్రయత్నం చేస్తే, మీరు చేసే అవమానాలకి, మీరు అనే మాటలకి వాడు లొంగిపోతే వాడు ప్రతిభావంతుడు కాదు. వాడికి ప్రకాశం లేనట్టే. వాడికి తేజస్సు లేనట్టే. వాడు తెలివైనవాడు కానే కాదు అంటున్నాడు భగవంతుడు. ఎందుచేత? నువ్వు చేసే అవమానానికి వాడు లొంగిపోతుంటే వాడు ప్రతిభావంతుడు ఎలా అవుతాడు? నువ్వు ఏ ఉద్దేశంతో చేస్తున్నావు, చెడ్డ ఉద్దేశంతో చేస్తున్నావా? మంచి ఉద్దేశంతో చేస్తున్నావా? అది వేరే విషయం. మొత్తం మీద నువ్వు ఏ ఉద్దేశంతో చేసినప్పటికీ, వాడు నీ ప్రభావానికి గురి కాకూడదు. మీరు ఒక మాట అంటే వాడికి అంతకు ముందు ఉన్న సంతోషం పోతుంది అనుకోండి, వాడు ప్రతిభావంతుడు కాదు. అంటే ఏమిటి? నీ మాటల ప్రభావానికి వాడు గురి అయిపోయాడు. నీ మాటల ప్రభావానికి వాడు లొంగిపోయాడు. అంటే వాడికున్న బలం కంటే నీ మాటల ప్రభావం ఎక్కువుంది కాబట్టే, నీ మాటల ప్రభావానికి వాడు పడిపోయాడు. అందుచేత వాడు ప్రతిభావంతుడు కాదు. దైవీ సంపద ఎవరికి ఉంటుంది అంటే ఎదుటివాడు తనని అవమానం చేసినప్పటికీ, తన మనసులో వికారం లేకుండా ఉన్నవాడే ప్రతిభావంతుడు. భగవంతుడి మీద విశ్వాసం ఒకడికి కలిగింది అనుకోండి, మీరు లేదు అని అంటారు అనుకోండి, మీ ప్రభావం వాడి మీద పడకుండా చూసుకున్నవాడే ప్రతిభావంతుడు. మీరు ఒకడిని భయపెట్టారు అనుకోండి, అప్పుడు చిత్తంలో ఏ రకమైన మార్పు లేకుండా, వికారం లేకుండా ఉన్నవాడే ప్రతిభావంతుడు. ఏవండీ మీరు పొగిడారు అనుకోండి వాడిని. మీరు పొగడటం వలన వాడికి ఏమైనా ఉద్వేగం వచ్చింది అనుకోండి లోపల, వాడు ప్రతిభావంతుడు కానే కాడు. ఒక మాట జ్ఞాపకం ఉంచుకోండి. మీలో కొంతమందికి సుఖాలు ఉండవచ్చు, కొంతమందికి మంచి పరిస్థితులు ఉండవచ్చు, కాని అది మటుకు నిజం కాదు. అది temporary. మానవుడికి పరమాత్మ దర్శనం అయ్యే వరకూ, సత్య దర్శనం అయ్యే వరకూ, వాడిని దుఃఖం ఏదొక రూపంలో వెంటాడుతూ ఉంటుంది. ఇప్పుడు మనం అనుభవించేవన్నీ ఆభాస సుఖాలు. సుఖం లాగే కనిపిస్తాయి, ఇవి ఎంతో కాలం నిలబడవు. మీ సంసారం బాగుండవచ్చు. మీరు సంతోషంగా ఉండవచ్చు, అది మటుకు నిజం కాదు. మరల కొంతకాలానికి దుఃఖం మనకు వచ్చేస్తుంది అది నిజం కాదు కాబట్టి. ఒక మనిషి ఎంతటి వాడు అయినప్పటికీ, ఎంత ధనవంతుడు అయినప్పటికీ, ఎంత తెలివిగలవాడు అయినప్పటికీ, పరమాత్మ దర్శనంఅయ్యే వరకూ, ఏదో ఒక రూపంలో వాడిని దుఃఖం విడిచిపెట్టదు. సత్యాన్ని దర్శించే వరకూ, తన స్వరూపాన్ని వాడు చూసేవరకూ, వాడిని దుఃఖం ప్రతీ జన్మలో కూడా వెంటాడుతూనే ఉంటుంది. ఒక జన్మలో దుఃఖం తక్కువ ఉండవచ్చు. ఒక జన్మలో ఎక్కువ ఉండవచ్చు.

మనకు జన్మ వచ్చినప్పుడు కూడా ఏమి చేస్తాడు అంటే ఈశ్వరుడు ఆ శరీరంలో వీడు ఎంత వరకూ తట్టుకోగలడు అని చూసి లోపల ఉన్న స్టోర్‌లో నుండి కొంత తీస్తాడు. అంటే వాడికి పుణ్యం, పాపం ఇంక లేదు అని కాదు. మన ఇంట్లో కాఫీ పెట్టినప్పుడు అందులో కొద్దిగా పంచదార వేస్తాము అంటే ఇంక మనకు ఇంట్లో పంచదార లేదా, ఆ డబ్బాలో చూస్తే తెలుస్తుంది. అలాగే మనకు పుణ్య పాపాలు చాలా ఉన్నాయి. కాఫీలో సరిపడా పంచదార వేసినట్టు మీ బాడీకి సరిపడా పుణ్య పాపాలు తీసుకొచ్చి ఈ బాడీ లో వేస్తాడు. మిగిలినదంతా ఆ స్టోర్‌లోనే ఉంటుంది. ఈ స్టోర్ ఏమవుతుంది? జ్ఞానం కలిగిన వాడికే ఇదంతా భస్మం అవుతుంది అని చెప్పారు. జ్ఞానం కలిగేవరకూ ఆ స్టోర్ ఎవ్వరు తియ్యలేరు. జన్మజన్మలకి ఆ స్టోర్ లోంచి తీస్తూ ఉండాలి, మళ్ళీ పెడుతూ ఉండాలి. అలా వస్తూనే ఉంటాయి. కాని జ్ఞానం కలిగితే మటుకు ఇదంతా భస్మం అవుతుంది. భక్తి అంటే సామాన్యం అనుకోకండి మన అమ్మే. ఈ విషయాన్ని మీరు చాలా సీరియస్‌గా తీసుకోండి. భక్తి అంటే మన అమ్మే. మనలని రక్షించేది మన భక్తే. అదే మన తల్లి. తల్లి ఏ విధంగా అయితే పిల్లలను కాపాడుతుందో, అదే విధంగా మన భక్తే మనలని కాపాడుతుంది. ఈ కాలమాన పరిస్థితులు చూసి, ఈ బంధువులను, ఈ స్నేహితులను, సమాజం యొక్క పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని, నీ తేజస్సు పోగొట్టుకోవద్దు. ఆర్థిక పరిస్థితులు మారవచ్చు. సాంఘిక పరిస్థితులు మారవచ్చు. ఈ ప్రకృతి పరిస్థితులు అలా మారుతూ ఉంటాయి. ఈ ప్రకృతి పరిస్థితులు కనుక వాటి ప్రభావం మీ మీద కనుక చూపిస్తే, మీరు ప్రతిభావంతులు కానే కాదు. ఇది ప్రకృతి, ఇది అజ్ఞానం. ఇది అవిద్య. ఇలా వస్తూనే ఉంటుంది. దాని యొక్క ప్రభావం నీ మీద పడకుండా చూసుకో, అప్పుడు నువ్వు ప్రతిభావంతుడు అవుతావు. బాహ్య పరిస్థితుల ప్రభావం వల్ల, సంఘంలో వచ్చే పరిణామాల వల్ల నీ తెలివిని కాని, నీ ప్రజ్ఞని కాని ఊడగొట్టుకోకు. నీ ప్రకాశాన్ని, నీ తేజస్సుని పోగొట్టుకోకు అన్నాడు.

తుకారామ్ మహారాష్ట్రకు చెందిన సెయింట్. ఆయన శరీరాన్ని దహనం చేయలేదు. వైకుంఠానికి తీసుకొని వెళ్ళటానికి ఆయన కోసం విమానం వచ్చింది. తుకారామ్ విమానంలో కూర్చొని భార్యను కూడా తీసుకువెళదాము అనుకుని పిలిస్తే వంటింట్లో పని ఉంది వస్తున్నాను ఉండండి అంది, ఈలోపు విమానం వెళ్ళిపోయింది. ఆవిడ వంటిల్లు వదిలి రాలేదు. ఆవిడకి యోగ్యత లేదు. మేము పురాణాలు విన్నాం అని మీలో ఎవరైనా అనవచ్చు. ఇది కలియుగంలో జరిగిన సంఘటన. తుకారామ్ పాండురంగ భక్తుడు. అతనికి రెండు పెళ్ళిళ్లు. మొదటి భార్యకి సంతానం లేదు. తుకారామ్ తల్లితండ్రులు మీకు సంతానం లేదు, సంతానం లేదు అనేవారు, ఈ తల్లిదండ్రుల పోరు పడలేక, మొదటి భార్య యొక్క అంగీకారంతో రెండో పెళ్లి చేసుకున్నాడు తుకారామ్. తరువాత కాలమాన పరిస్థితులు బట్టి ఆయనకి రెండో పెళ్లి అయిన తరువాత దరిద్రం వచ్చింది. అసలే ఆర్థిక చిక్కుల్లో ఉన్నాడు తుకారామ్. దానికి

తగ్గట్టు ఆ టైములో పూనా పరిసర ప్రాంతాల్లో, మహారాష్ట్రలో కరువు వచ్చింది. ఇంటిలోని వారికి అన్నం పెట్టలేకపోయాడు తుకారామ్. తుకారామ్ మొదటి భార్య పాపం అన్నం, అన్నం అంటూ చచ్చిపోయింది. ఇది నా జీవితాన్ని చలింపజేసింది. చివరి రోజుల్లో, వాడి ప్రతిభ అంతా కుంగదీసేసింది అన్నాడు తుకారామ్. అయ్యో అన్నం కూడా పెట్టలేకపోయాను అని తుకారామ్ విలపిస్తూ ఉంటాడు. అంటే తుకారామ్ వంటి మహా భక్తుడిని కూడా లొంగదీసేసింది, పరిస్థితుల ప్రభావం అంటువంటిది. అంటే అటువంటి విపత్కర పరిస్థితి వచ్చినప్పుడు కూడా నీ ప్రతిభని పోగొట్టుకోకు, నీ ప్రకాశాన్ని పోగొట్టుకోకు, నీ తేజస్సుని పోగొట్టుకోకు, అప్పుడే నువ్వు ప్రజ్ఞావంతుడివి అవుతావు. అప్పుడే నీకు విముక్తి అంటున్నాడు భగవంతుడు వాసుదేవస్వామి. పరిస్థితుల ప్రభావానికి మహాత్ములు కూడా, తుకారామ్ లాంటి మహాభక్తుడు కూడా ఆ సంఘటన కి చలించిపోయాడు. అటువంటి మహాత్ములను కూడా చలింపచేస్తుంది అయ్యా, అందుచేత నువ్వు పరిస్థితుల ప్రభావానికి లొంగకు. లొంగితే నీ శ్రేయస్సు పోతుంది, నీ ప్రకాశం పోతుంది. నువ్వు జఢవస్తువు అయిపోతావు. జీవించి ఉండగానే నీ ప్రకాశం ఎప్పుడైతే పోయిందో, జీవించి ఉండగానే చచ్చిపోయిన వాడితో సమానం అయిపోతావు. అందుచేత నీ శ్రేయస్సును పోగొట్టుకోకు, నీ ఆత్మవిశ్వాసాన్ని పోగొట్టుకోకు అంటున్నాడు భగవంతుడు వాసుదేవస్వామి. మాటల యొక్క ప్రభావం నీ మీద పడనివ్వకు. పరిస్థితుల యొక్క ప్రభావం నీ మనసు మీద పడనివ్వకు అంటున్నాడు. తేజస్సు, ప్రకాశం, ప్రతిభ అది నువ్వు కాపాడుకో. అందుచేత పరిస్థితులకు మనం లొంగకుండా చూసుకోవాలి. అంటే సమాజంలో నిన్ను ఎవరైనా అగౌరవపరచవచ్చు. దేశంలో నిన్ను ఎవరైనా అగౌరవపరచవచ్చు. పరిస్థితులు నీకు అనుకూలంగా లేకపోవచ్చు. కొంతమంది జీవితాలు వడ్డించిన విస్తరిలా ఉంటాయి. కొంతమంది జీవితాలు ఎప్పుడూ ఎదురీతే, ఒక కష్టం వదిలేటప్పటికి ఇంకో కష్టం, ఒక కష్టం వదిలేటప్పటికి ఇంకో కష్టం. జీవితం పొడవునా పాపం ఎదురు ఈదాల్సిందే. తల్లి కడుపులో నుంచి బయటకి వచ్చింది మొదలు మరణించే వరకూ అన్నీ కష్టాలే. జీవితంలో ఎదురీతే కొంతమందికి. అలా ఎదురీతైనా సరే నువ్వు మటుకు చలించకు. నీ దేహం యొక్క ప్రారబ్ధాన్ని బట్టి అది వస్తుంది. మళ్ళీ ఖర్చు అయిపోతుంది. ఈ పరిస్థితులలో ఈ దేహంలో, ఈ జన్మలో ఉండగా, వాళ్ళు ఎదురీదగలగాలి అని ఈదేహాన్ని ఏర్పాటు చేశాడు ఈశ్వరుడు. అది ఈశ్వరప్రసాదం గానే తీసుకుని, నీ ప్రతిభ మటుకు పోగొట్టుకోకు. నువ్వు ఆందోళన పడకు. నీ శ్రేయస్సుని పోగొట్టుకోకు అని చెబుతున్నాడు భగవంతుడు వాసుదేవస్వామి. అంతా అనుకూలంగా ఉన్నప్పుడు అందరూ సంతోషంగానే ఉంటారు. ఎదురీదుతున్నప్పుడు నువ్వు మటుకు వికారాలు పొందకు. ఒక మనిషి ఉన్నాడు అనుకోండి, ఏ రకమైన కష్టం వాడికి తెలియదు అనుకోండి ఆ మనిషికి

మాధుర్యం రానే రాదు. జీవితంలో failures రావచ్చు. ఒకొక్కసారి failures కూడా నీకు ఎంతో ఉపయోగపడవచ్చు. జీవితంలో ఎదురయ్యే విజయాల కంటే అపజయాలే నిన్ను హృదయంలోకి తీసుకువెళతాయి. నీ జీవితంలో నీకు వచ్చే విజయాల కంటే, నీకొచ్చే అపజయాలే, నీకు వచ్చే ఎదురుదెబ్బలే, నీ మనసుని అంతర్ముఖపరచవచ్చు. సత్యం వైపుకి దారి చూపిస్తాయి. మీరు అనుకొన్నవి అన్నీ జరిగిపోతున్నాయి అనుకోండి మీకు పొగరుబోతుతనం రావచ్చు. అప్పుడు ఏమి అవుతుంది? వినయానికి దూరం అవుతారు, సత్యానికి దూరం అవుతారు, కాంతికి దూరం అవుతారు, శాంతికి దూరం అవుతారు. మీరు అనుకొన్నవి జరగటం లేదు అనుకోండి అప్పుడు ఆలోచన వస్తుంది. మనం అనుకొన్నవి జరగటం లేదు ఏమిటి అని మనసు ఆలోచిస్తుంది, అంతర్ముఖం అవుతుంది. ఏది మనకు మంచిదో, ఏది మనకు చెడో మనకుతెలియదు. ఏ సంఘటన ఎందుకు జరుగుతుందో మనకు తెలియదు. పూర్వ జన్మలు మనకు తెలియదు, రాబోయే జన్మలు తెలియదు. ఎందుకు ఇక్కడికి వచ్చామో తెలియదు. పరిస్థితులు ఎందుకు ఇలా వక్రీకరిస్తున్నాయో మనకు తెలియదు. మనకు ఏమైనా మంచి జరిగితే ఆ మంచి ఎందుకు జరుగుతోందో మనకు తెలియదు. ఏదైనా చెడ్డ జరిగితే ఆ చెడ్డ ఎందుకు జరుగుతోందో మనకు తెలియదు. రామాయణంలో వాల్మీకి మహర్షి ఒక మాట చెప్పాడు మీరు బాగా జ్ఞాపకం ఉంచుకోండి, చాలా చక్కటి మాట చెప్పాడు. ఋషి నోట ఒక మాట వస్తే ఆ మాట జరిగి తీరాల్సిందే. కోట్ల సంవత్సరాల తరువాత కూడా ఆ మాటకి అంతే శక్తి ఉంటుంది. అదే త్రికాల సత్యం. మానవజాతికి అటువంటి శాశ్వత సత్యాలు చెప్పాలి అనుకున్నప్పుడే, నోరు తెరుస్తాడు లేకపోతే నోరు తెరవడు. వాల్మీకిమహర్షి ఒక మాట చెప్పాడు. ఇది నా సొంతం కాదు, వాల్మీకి మహర్షి చెప్పిన మాట మీకు చెబుతున్నాను. ఇంట్లో డబ్బులు ఎక్కువైనా, ఇంట్లో కష్టాలు వచ్చినా, ఎక్కడైనా ప్రమాదంలో పడినా ఇటువంటి పరిస్థితులలో మనస్సు నిగ్రహించుకోవటం ఎంతటి వాడికైనా కష్టమే అని వాల్మీకిమహర్షి చెప్పాడు. ఇటువంటి మాటలు ఇముడ్చుకోవడం మానేసి, మన హృదయంలోకి దింపుకోవడం మానేసి, ఎంతసేపు రాముడి భార్య సీత, రాముడి భార్య సీత ఇదేనేంటండి. ఆ ఋషి ఆ క్యారెక్టర్ ద్వారా చెప్పే సందేశం ఏమిటి ? ఆ సందేశం మనకు ముఖ్యం. వాల్మీకిమహర్షి తన క్యారెక్టర్స్ ద్వారా మనకు శాశ్వతంగా ఏమి చెప్పదలచుకున్నాడో, ఎక్కడికి తీసుకువెళ్ల దలచుకున్నాడు మనలని ఎలా బాగు చేయదలుచుకున్నాడు. అది ప్రధానం. శ్లోకాలు మనకు ప్రధానం కానే కాదు. మూడు పరిస్థితులలో డబ్బు ఎక్కువ వచ్చినప్పుడు, ప్రమాదంలో పడ్డప్పుడు, ఇంటి దగ్గర పరిస్థితులు మీరు అనుకున్నదానికి వ్యతిరేకంగా జరుగుతున్నప్పుడు, ఈ మూడు పరిస్థితులలో మానవుడు మనసు నిగ్రహించుకోవడం చాలా కష్టం. ఎంతటి వాడికైనా కష్టమే అని చెప్పాడు. అసాధ్యం

అని చెప్పలేదు కష్టం అని చెప్పాడు. ఇటువంటి పరిస్థితులలో కూడా నీ యొక్క ప్రతిభని పోగొట్టుకోకు, నీ సామర్థ్యాన్ని పోగోట్టుకోకు, నీ efficiencyని పోగోట్టుకోకు. ఇటువంటి పరిస్థితుల ప్రభావం నీమీద పడనివ్వకు. వాటి ప్రభావం నీమీద పడుతూ ఉంటే ఇంక నీ ప్రకాశం ఏంటి? నీ తేజస్సు ఏంటి? నీ తెలివి ఏంటి? నీ ప్రతిభ ఏంటి? అంటున్నాడు భగవంతుడు వాసుదేవస్వామి. ఎటువంటి పరిస్థితులలో కూడా నీ మనసుని చలింపనీయకు. నేను నీకు ప్రొటెక్షన్. నేను రక్షకుడను, నేను ఉండగా నువ్వు బెదిరిపోవాల్సిన పని లేదు. నీ మనసుని కంగారు పెట్టుకోవద్దు. నీకు నీడ లాగా ఉంటాను. మనిషి తన శరీరాన్ని ఎలా జాగ్రత్తగా చూసుకుంటాడో, అలా నా భక్తుల శరీరాన్ని కూడా కాపాడుకోవాల్సిన బాధ్యత నాది అన్నాడు భగవంతుడు వాసుదేవ స్వామి. క్షమ అంటే ఓర్పు. మన అందరికి ఓర్పు ఉందండి, అందరం ఓర్పుగానే కూర్చొన్నాం కదా. మనకు ఎప్పుడైనా ఉద్రేకం వస్తుంది, ఆవేశం వస్తుంది, వికారం వస్తుంది, వికారం అంటే పడని వస్తువులు తిన్నప్పుడు వచ్చే వికారం కాదండి. మనసులో వచ్చే వికారాలు. మీరు బాగా జ్ఞాపకం పెట్టుకోండి ఒకటి వికారం రాకూడదు. రెండు ఆవేశం రాకూడదు. మూడు ఉద్రేకం రాకూడదు. మూడింట్లో ఏది వచ్చినా మనకు ఓర్పు లేనట్టే. మనం ఇంటి దగ్గర అన్నం వండుకోవాలి అనుకుంటాం అనుకోండి, బియ్యం ఉండాలి. బియ్యం లేకపోతే అన్నం లేదు. ఇల్లు లేకపోతే నీడ లేదు. గుడ్డ లేకపోతే మనకు కట్టుకోవడానికి ఏమి ఉండదు. అదేవిధంగా నీకు తెలివి లేకపోతే, ప్రజ్ఞ లేకపోతే నువ్వు విషయం అర్థం చేసుకోలేవు. మనం భగవద్గీత చదువుతాము. బియ్యం లేకపోతే అన్నం లేదు అలాగే మనకు ప్రజ్ఞ కనుక లేకపోతే, మనకు తెలివి కనుక లేకపోతే, మనకు ప్రకాశం కనుక లేకపోతే ఈ శాస్త్రాన్ని అర్థం చేసుకునే శక్తి మనకు లేదు. ఋషికి ఏ గుణాలు అయితే సహజంగా ఉంటాయో, ఆ గుణాలు మనకు సహజంగా లేకపోవచ్చు. లేవు కాబట్టి మనలని ప్రాక్టీస్ చేయమంటున్నాడు. అది భగవంతుడు చెప్పేది. మీలో ఎవరికైనా మంచిగుణాలు ఉన్నాయి అనుకోండి, ఈ ఒక్క జన్మలో ప్రాక్టీస్ చేస్తేనే ఆ మంచిగుణాలు మీకు వచ్చాయి అని మీరు అనుకోకండి. మీలో ఎవరికైనా మంచిగుణాలు ఉంటే అది పూర్వజన్మలో ఎంత కష్టపడ్డారో, ఎంత శ్రమ పడ్డారో, ఎంత ఓర్చుకుని మీరు ఆ కళ్యాణగుణాలు సంపాదించుకున్నారో? ఏ మనిషిలో అయినా కళ్యాణగుణాలు కనిపిస్తూ ఉంటే వాడు పూర్వజన్మలో ఎంత కష్టపడ్డాడో, వాటికోసం ఎంత ధారపోసాడో మనకేమి తెలుసు? ఒక మనిషి ముఖం చూసినంత మాత్రాన మనకు ఏమి తెలియదు. మీరు రూపాయలు ఇండియన్ బ్యాంకులో వేసుకుంటున్నారు, ఆంధ్రా బ్యాంకులో వేసుకుంటున్నారు. మరి మీరు చేసే మంచిపనులు ఎక్కడ పడతాయి అంటే అవి దేవుడి బ్యాంకులో పడతాయి. దేవుడికి కూడా ఒక బ్యాంకు ఉంది. మీరు చేసే మంచిపనులు అన్నీ ఆయన గాలికి

వదిలేయడు. ఆయన బ్యాంకులో వేసుకొంటాడు. బ్యాంకులో వేసిన డబ్బు ఎవరి డబ్బు వారికి ఎలా ఇచ్చేస్తున్నారో, మీరు చేసిన మంచి పనులు అన్నీ ఆయన బ్యాంకులో వేసి మళ్ళీ మీకు అప్పజేప్పేస్తాడు. ఈ బ్యాంకులు దివాలా తీయవచ్చు కాని ఆ బ్యాంకు తీయదు. ఇది మాన్ మేడ్. అది మాన్ మేడ్ కాదు కాబట్టి, సత్యం కాబట్టి దివాలా తియ్యదు. అందుచేత మీకు మంచి ఆలోచన వచ్చినా, ఒక మంచి పని చేసినా, ఎంత చిన్న మంచి పని చేయండి అది దేవుడి బ్యాంకులో పడుతుంది. ఒక మంచి తలంపు వచ్చింది అనుకోండి మీకు, ఒక చక్కటి మనోహరమైన తలంపు ఏదైనా వచ్చింది అనుకోండి మీకు, అది కూడా దేవుడు తన బ్యాంకులో వేసేసుకుంటాడు. మీరు చేసే మంచి పనులు త్రికరణ శుద్ధిగా చేయండి. ఇది అంతా దేవుడి బ్యాంకులో జాగ్రత్తగా ఉంటుంది. వీటిని తిరిగి మీకే ఇచ్చేస్తాడు. కొంతమంది ఏమని అడుగుతారు అంటే ఏవండీ మీరేమి పూజలు చెయ్యటం లేదు, జపాలు చెయ్యటం లేదు, వ్రతాలు చెయ్యటం లేదు, అభిషేకాలు చెయ్యటం లేదు, మీకు జ్ఞానం ఎలా వచ్చింది? న్యాయంగా ఉంది కదా ఈ ప్రశ్న, ఏమి అక్కర్లేదు హృదయపూర్వకంగా మీకు ధర్మం యందు గౌరవం ఉంటే, జ్ఞానం యందు గౌరవం ఉంటే అది వచ్చేస్తుంది. ధర్మం పట్ల, జ్ఞానం పట్ల, సత్యం పట్ల, ఆత్మ పట్ల, హృదయపూర్వకంగా నిండుమనసుతో నీకు దాని పట్ల గౌరవం ఉంటే, మీకు జ్ఞానం వస్తుంది అన్నాడు. ఈ వ్రతాలు మీకు వద్దని ఆయన చెప్పటం లేదు. వ్రతం చెయ్యకపోయినా మీకు వచ్చేస్తుంది ధర్మం పట్ల, జ్ఞానం పట్ల మీకు ఆప్యాయత కనుక ఉంటే మీరు ప్రకృతి విషయాలకి హృదయంలో ఏ విధంగా అయితే స్థానం ఇస్తున్నారో, జ్ఞానానికి అటువంటి స్థానం ఇవ్వండి మీకు జ్ఞానం వచ్చేస్తుంది. రాగ ద్వేషాలకు మీ హృదయంలో ఎటువంటి స్థానం ఇస్తున్నారో, జ్ఞానానికి అటువంటి స్థానం ఇవ్వండి. మీరేమి ఖర్చు పెట్టకుండా, మీ చెమట ఏమీ ధారపోయకుండా మీకు జ్ఞానం వచ్చేస్తుంది. మీ హృదయంలో మీరు దేనికి ప్లేస్ ఇస్తున్నారు? పూజలు చేస్తున్నారు రైటే, జపాలు చేస్తున్నారు రైటే, యాత్రలకి వెళుతున్నారు రైటే. కాని మీ హృదయంలో దేనిని గౌరవిస్తున్నారు? దేనికి ప్లేస్ ఇస్తున్నారు? అది ఈశ్వరుడికి కావలసింది. ఏమీఅక్కర్లేదు మీకు గనుక జ్ఞానం పట్ల, ధర్మం పట్ల, సత్యం పట్ల, ఆత్మ పట్ల, భగవంతుడు పట్ల గౌరవం ఉంటే తప్పనిసరిగా జ్ఞానం మిమ్మల్ని వరిస్తుంది. మీ హృదయంలోంచి రావాలి, జ్ఞానం అనేది పైనుంచి పోసేది కాదు. లోపల నుండి ఊరేది. ధైర్యం అంటే ఏమిటి? చాలామంది ముసలి వాళ్ళం అయిపోతున్నాం అంటూభయపడుతూ ఉంటారు. దేహం ముసలిది అయిపోతున్నప్పటికీ, ఇంద్రియాలలో పట్టు తప్పిపోయినప్పటికీ, మన మాట ఎవరు వినకపోయినప్పటికి, మిమ్మల్ని రోజూ పలకరించేవారు మిమ్మల్ని పలకరించడం మానేసినా, మీ ఊరు మిమ్మల్ని విడిచిపెట్టినా, సమాజం మిమ్మల్ని విడిచిపెట్టినప్పటికీ, మీ ధైర్యం మీరు

విడిచిపెట్టకూడదు. మీ స్థైర్యం మీరు పోగొట్టుకోకూడదు. ఎటువంటి పరిస్థితులలో ఉన్నా కూడా ధైర్యం విడిచిపెట్టడానికి వీలు లేదు. మనిషికి మందు ధైర్యమే అని చెబుతున్నాడు భగవంతుడు వాసుదేవస్వామి. మీకు ఏదైనా అనారోగ్యం వచ్చింది అనుకోండి ధైర్యం లేదు అనుకోండి ఎన్ని మందులు పుచ్చుకున్నా మీకు పట్టు ఇవ్వదు. శరీరం ముసలిది అవ్వచ్చు, మీకు రోగం రావచ్చు, మీలో శక్తి తగ్గిపోవచ్చు. మీ కళ్ళు సరిగ్గా కనిపించక పోవచ్చు. చెవులు సరిగ్గా వినిపించక పోవచ్చు. ఎటువంటి పరిస్థితులు ఉన్నప్పటికీ మీ ఇంట్లో నిన్ను ఆదరించక పోవచ్చు. నిన్ను చీదరించుకోవచ్చు, మీ ఇంట్లో వాళ్ళు మీకు సరిగ్గా అన్నం పెట్టక పోవచ్చు. అటువంటి పరిస్థితులలో కూడా నీ ధైర్యాన్ని విడిచిపెట్టడానికి వీలు లేదు. నువ్వు చావడానికి సిద్దంగా ఉన్నప్పుడు కుడా, ఈ సాయంత్రంలోగా నువ్వు చస్తావని డాక్టరు గారు చెప్పినప్పుడు కూడా మీ దైర్యం పోవటానికి వీలు లేదు. అది ధైర్యం అంటే.

ఈ ధైర్యాన్ని నువ్వు కనుక ప్రాక్టీస్ చేస్తే, ఈ ధైర్యం అనే గుణం నీ కూడా వస్తుంది. ఇది స్మశానంలో ఆగిపోదు. సోదరమహాశయులారా! ఈ శరీరం మరణించిన తరువాత దీనిని స్మశానంలో కాలుస్తారు, అది నిజమైన స్మశానం కాదు. నా కోరికలు అక్కడ తగులబడవు. నా అహంకారం అక్కడ తగులబడదు. ఏది తగులబడుతుంది? నా శరీరంలో ఉన్న మాంసం, నా శరీరంలో ఉన్న ఎముకలు, నా శరీరంలో ఉన్న రక్తం మాత్రమే అక్కడ తగులబడుతుంది. ఈ శరీరంలో ఉన్న ఎముకలు తగులబడే స్మశానం, మాంసం తగులబడే స్మశానం, అది నిజమైన స్మశానం కాదు. It is not a real burial ground, మరి ఏది real burial ground? ఏ హృదయంలో అయితే కోరికలు తగులబడుతున్నాయో, నాకున్న ప్రకృతి వాసనలు అన్నీ కూడా తగులబడి పోయి బూడిద అవుతున్నాయో, అది నిజమైన స్మశానం, అది నిజమైన burial ground, అక్కడే ఈశ్వరుడు ఉన్నాడు. మీ హృదయంలో వాసనలు బర్న్ చేస్తున్నప్పుడు, ధైర్యంగా నిలబడి ఉండాలి. నువ్వు deserve అయ్యి ఉండాలి, అప్పుడు ఈశ్వరఅనుగ్రహం ఉంటుంది. ఆ సందర్భంలో నువ్వు ధైర్యాన్ని పోగొట్టుకుంటే, అప్పుడు నీకు పిరికితనం కనుక వస్తే, అప్పుడు కూడా నువ్వు సోమరితనానికి గురి అయితే నీకు జ్ఞానం కలగదు అంటున్నాడు భగవంతుడు వాసుదేవస్వామి. ఈశ్వరుడిని ప్రార్థిస్తుంటే, ఈశ్వరుడిని పూజిస్తుంటే, ఈశ్వరుడిని స్మరిస్తుంటే, ఈ శరీరము ఉండగానే, నీ హృదయం అనే స్మశానంలో మన వాసనలు అన్నీ కత్తిరిస్తాడు భగవంతుడు. భగవంతుడు కత్తిరించే టైములో నువ్వు పిరికి పడితే, డాక్టరు ఆపరేషన్ చేయటానికి కత్తులుఉడకబెడుతూ ఉంటారు అనుకోండి, నువ్వు పారిపోతే ఇంక ఆపరేషన్ ఎవరికి చేస్తారు? అదే విధంగా భగవంతుడు నీ హృదయంలో ఉన్న కోరికలను దహనం చేసే టైములో కూడా, వాటిని కత్తిరించే టైములో కూడా నీ దగ్గర పిరికితనం ఉంటే నిన్ను ముట్టుకోడు ఈశ్వరుడు. నువ్వు వాటిని తట్టుకోగలగాలి,

నువ్వు deserve అయ్యి ఉండాలి అప్పుడు. నీకు ధైర్యం ఉండాలి అని చెబుతున్నాడు. నువ్వు ధైర్యం అనే గుణం కలిగి ఉంటే, ఈశ్వరుడు తన వంతు పని తను చేస్తాడు అంటున్నాడు భగవంతుడు వాసుదేవస్వామి. నువ్వు చేయవలసిన పని నువ్వు చెయ్యి, నువ్వు ఈశ్వరుడికి ఏమి జ్ఞాపకం చేయవలసిన అవసరం లేదు. నిన్న సాయంత్రం ఏమి కూర వేసుకుని తిన్నామో తెలియని మనమా ఈశ్వరుడికి జ్ఞాపకం చేసేది. మీరు జ్ఞాపకం చెయ్యకపోతే ఏ పని చెయ్యాలో ఈశ్వరుడికి తెలియదా? ఈ శరీరం ఉండగానే, ఇందులో ప్రాణం ఉండగానే, ఎవడికైతే ఈశ్వర అనుగ్రహం కలిగిందో వాడిలో ఉన్న ప్రకృతికి సంబంధించిన కోరికలను, భవిషత్ జన్మలు రావటానికి బీజాలను, ఈ శరీరం ఉండగానే లోపల దహనం చేస్తాడు వాడే ఈశ్వరుడు, వాడే గురువు, వాడే ఆత్మ. అదే నిజమైన burialground.

శుచిగా ఉండమంటున్నాడు భగవంతుడు. మనం అందరం దేహాన్ని శుచిగా ఉంచుకుంటున్నాం. కాని మనసు కూడా శుచిగా ఉండాలి అంటున్నాడు. మనం ఎంతో శుచిగా చూసుకుంటున్నటువంటి దేహం ఇక్కడే స్మశానంలో కాలిపోతుంది. దేహం విషయంలో ఎంత శ్రద్ధ తీసుకుంటున్నావో అదే విధంగా మనసుని కూడా శుచిగా ఉంచుకుంటున్నావా? దేహ శుచే గాని మనసు యొక్క శుచి అక్కరలేదా? కుండ ఉంది. మీరు కుండని బయట తోమేసి లోపల వదిలేస్తారా అని భగవంతుడు అడుగుతున్నాడు, ఒకవేళ నేను చెప్పే మాటలు మీకు నిష్టూరంగా, కష్టంగా ఉండవచ్చు. కష్టంగా ఉన్నా సరే ఇష్టంగా వినండి. ఓట్లు కోసం, నోట్లు కోసం చెప్పిన మాటలు కావు ఇవి. భగవంతుడు కేవలం మనలని తరింపచేయటానికి, ఆయన స్వరూపం మనకు ఇవ్వటం కోసం అనుభవంతో చెప్పినటువంటి మాటలు, ఎంతో శాంతి తోటి ప్రేమ తోటి చెప్పిన మాటలు ఇవి. సబ్బు ద్వారా ఈ శరీరం ఏ విధంగా అయితే కడగబడుతుందో, ధ్యానం ద్వారా, జపం ద్వారా, పూజ ద్వారా, నామం ద్వారా, సద్గ్రంధ పఠనం ద్వారా, సత్పురుషుల సహవాసం ద్వారా మనస్సు కడగబడుతుంది. మన శరీరానికి సబ్బు ఎటువంటిదో, మన మనసుకి ప్రార్థన అంటువంటిది. నిన్న చెప్పిందే ఇవాళ చెబుతున్నారు అని కొంతమంది అంటారు. మరి నిన్న తాగిన కాఫీ ఇవాళ ఎందుకు తాగుతున్నారు? నిన్న తిన్న అన్నం ఇవాళ తినవచ్చు. నిన్న తాగిన కాఫీ ఇవాళ తాగవచ్చు. నిన్న చదివిన పుస్తకం ఇవాళ చదవకూడదా? దేహం ఎందుకు వచ్చింది? భోగం కోసం, ప్రాణం ఎందుకు వచ్చింది ? భోగం కోసం, ఇంద్రియాలు ఎందుకు వచ్చినవి? భోగం కోసం, మనసు ఎందుకు వచ్చింది? భోగం కోసం, స్నేహాల పేరు చెప్పి, బంధువుల పేరు చెప్పి ఎంతో కాలం ఖర్చు పెట్టేస్తూ ఉంటాము. కానీ మన కూడా వచ్చే ఈశ్వరుడి కోసం ఎంత కాలం ఖర్చు పెడుతున్నాము. ఈ బంధువులు మన కూడా వస్తారా? లేకపోతే ఈ స్నేహితులు మన కూడా వస్తారా? మీ స్నేహితులు కోసం, మీ

కుటుంబం కోసం, మీ బంధువులు కోసం రోజుల తరబడి, నెలల తరబడి, సంవత్సరాల తరబడి ఖర్చు పెడుతున్న మీరు ఈశ్వరుడి కోసం, పరమేశ్వరుడి కోసం రోజులో ఒక అరగంటో, పది నిమిషాలో ఇవ్వలేరా? ఆయనకు మీ టైములో కొంత కాలం ఇవ్వలేరా? ఆయన మీకు జ్ఞానం ప్రసాదిస్తాడు. జీవితం అంతా మీ కుటుంబం కోసం, మీ స్నేహితుల కోసం, మీ బంధువుల కోసం ఖర్చు పెడుతున్న మీరు, పరమేశ్వరుడి కోసం రోజుకొక అరగంట ఇవ్వలేరా? ఈ జీవితంలో ముప్పై నిమిషాలు ఈశ్వరుడి కోసం ఖర్చు పెట్టలేరా? ఆయనకోసం ఖర్చుపెట్టిన ఈ ముప్పై నిమిషాలే మీరు జీవించినట్టు లెక్క, మిగతా జీవితం, జీవితం కానే కాదు అంటున్నాడు పరమేశ్వరుడు. మనకంటే వయసులో చిన్న వాళ్ళు మనలని ఏమైనా విమర్శించారు అనుకోండి, నిన్న కాక మొన్నటి వాడు మనలని విమర్శిస్తున్నాడు అంటాము. వంద సంవత్సరాలు జీవించినప్పటికీ ఎవరికైతే జ్ఞానము లేదో వాడు పిల్లవాడే. జ్ఞానము లేని వాళ్ళు అందరూ పిల్లలే. ఒక్క జ్ఞానము ఉన్నవాడే పెద్దవాడు. జ్ఞానము ఉన్నవాడే యోగి. జ్ఞానము లేనివాడు వాడికి వంద సంవత్సరాలు వచ్చినప్పటికీ, వాడు మటుకు బాలుడే అంటున్నాడు భగవంతుడు వాసుదేవస్వామి. ఇంకో రకంగా చెప్పటానికి ఆర్గుమెంట్ లేదు. ఆర్గుమెంట్ వల్ల మీరు కేసు నెగ్గవచ్చు. కాని తత్వం మటుకు తెలియదు. ఇది బియాండ్ లాజిక్, ఇది బియాండ్ఆర్గుమెంట్. ఇది బియాండ్ వర్డ్. మీరు వెయ్యి సంవత్సరాలు బ్రతికినా కూడా మీరు పిల్లలే, మీకు కనుక జ్ఞానము లేకపోతే, అది భగవంతుడు చెప్పిన మాట. మీకు ఎటువంటి పవిత్రమైన తలంపులు వస్తున్నాయి. ఎటువంటి ఉదాత్తమైన తలంపులు వస్తున్నాయి. ఆ తలంపులు విషయంలో కూడా శుచిగా ఉండాలి. నువ్వు తినే ఆహారం విషయంలోనే శుచిగా ఉండటం కాదు, నీకు వచ్చే తలంపుల విషయంలో కూడా నువ్వు శుచిగా ఉండాలి అంటున్నాడు భగవంతుడు వాసుదేవస్వామి. నీ కంచం, నీ మంచం అన్నీ శుచిగా ఉండటం మంచిదే. నువ్వు లోపలకు తీసుకునే ఆహారం కూడా శుచిగా ఉండటం మంచిదే. రుచిగా ఉండటం మంచిదే. రుచి, శుచి విడిచిపెట్టమని భగవంతుడు చెప్పటం లేదు. కానీ మీకు వచ్చే తలంపులు విషయంలో మీకున్న ఆదర్శాల విషయంలో, మీకున్న ఆశయాల విషయంలో, మీకున్న ఆకాంక్షల విషయంలో, ఎంతవరకు శుచిగా ఉంటున్నారు. ఎటువంటి పవిత్రమైన భావాలు నీకు వస్తున్నాయి. నీ మనసులో వచ్చే తలంపులు విషయంలో కూడా నువ్వు శుచిగా ఉండమంటున్నాడు భగవంతుడు వాసుదేవ స్వామి. అయితే మన శుచి కంచాలకి, మంచాలకి సరిపెట్టుకుంటున్నాము. మంచి, మంచి తలంపులు నాకు కలగాలి అని ఎప్పుడైనా భగవంతుని ప్రార్థిస్తున్నావా? పరమేశ్వరుడి పాదాలను ఎప్పుడైనా ఆశ్రయించావా? ఈ లోకానికి సంబంధించిన విషయాలను నా మనసుకి దూరంగా ఉంచమని మీరు ఎప్పుడైనా పరమేశ్వరుని ప్రార్థిస్తున్నారా? మీరు

ఎప్పుడైనా భగవంతుని ప్రార్థించినా లోకవిషయాల కోసమే కదా, ఇంక మనకు జ్ఞానము ఏమిటండీ?

సోదరమహాశయులారా! మీరు చేతితో చేసే ప్రతి పనికే కాదు, నోటితో మాట్లాడే ప్రతి మాటకే కాదు, మీ మనసులోకి వచ్చే ప్రతి చిన్న తలంపుకి కూడా, మీరు సమాధానం చెప్పవలసి ఉంటుంది. ఈనాడు కాకపోయినా ఏ నాటికైనా, ఈ జన్మలో కాకపోయినా మరొక జన్మలో అయినా, ఈ లోకంలో కాకపోయినా మరొక లోకంలో అయినా, మీకు వచ్చే ప్రతీ చిన్న తలంపుకి కూడా మీరు భగవంతుడికి ఏదోఒకరోజు సమాధానం చెప్పాల్సిందే అంటున్నాడు పరమాత్మ. మీరు ఏకాంతంగా కూర్చున్నప్పుడు మీకు ఏవో తలంపులు వచ్చాయి అనుకో, మంచి తలంపు వస్తే మంచి తలంపు. చెడ్డ తలంపు వస్తే చెడ్డ తలంపు అది కూడా పరమేశ్వరుడు మీ హృదయంలో నుండి చూస్తున్నాడు అన్న విషయం మీరు మరచిపోకండి. దానికి మీరు సమాధానం చెప్పుకోవాల్సిన రోజు కూడా వస్తుంది అని మీరు మరచిపోకండి. ఏ తలంపులు అయితే మనకు దుఃఖాన్ని తీసుకు వస్తున్నాయో, ఆ తలంపులను బయటికి పొమ్మన్నా కూడా ఒకోసారి అవి బయటకి పోవు. ఎందుచేత ఆ తలంపులు మనకు ఎక్కువగా వస్తున్నాయి? పూర్వజన్మలో వాటిని మనం ఆదరించాము కాబట్టి ఈ జన్మలో ఎక్కువగా వస్తున్నాయి. అంతా మనం చేసుకున్న తప్పు. మీరు ఏకాంతంగా కూర్చొని ఉండగా, ఏ తలంపులు అయితే మీకు ఎక్కువగా వస్తున్నాయో, ఆ తలంపులను మీరు పూర్వజన్మలో బాగా అభ్యాసం చేశారు అది మీరు గుర్తుంచుకోండి. దీనికోసం మీరు పుస్తకం చదవక్కరలేదు. రుజువులకి వెళ్లక్కరలేదు. ఏమి తింటే అదే తేనుపు వస్తుంది. వంకాయ కూర తింటే బీరకాయ కూర తేనుపు ఎందుకు వస్తుంది? ఆ తలంపులు ఇప్పుడు దుఃఖం తీసుకువస్తున్నాయి కాబట్టి అక్కర్లేదు అనుకుంటున్నారు. పూర్వజన్మలో మీరు అక్కర్లేదు అనుకోలేదు వాటిని ప్రీతిగా పోషించారు. ప్రీతిగా పోషించారు కాబట్టి మీ వెంటే వచ్చాయి.

అద్రోహం అంటే ద్రోహం చేయకుండా ఉండటం. ద్రోహం చేయకుండా ఉండటం అంటే ఏమిటి? మీకు ఎవరికో పది రూపాయలు దానం చెయ్యాలని ఉంది అనుకోండి నేను వచ్చి వద్దు అని చెబుతాను అనుకోండి అది ద్రోహం. మీకు ఎవరికైనా మంచి చెయ్యాలి అని ఉంది అనుకోండి ఆ మంచి చెయ్యద్దు అంటాను అనుకోండి అది ద్రోహం. అందుచేత ద్రోహానికి వెళ్లకు. ద్రోహానికి వెళితే నీ మనస్సు కుళ్లిపోతుంది. ద్రోహ చింతనతో ఉండే స్నేహాలు కూడా నిలబడవు. ఒకరినొకరు ద్రోహం చేసుకునే ఉద్దేశం ఉన్నప్పుడు ఆ స్నేహాలు ఎంతసేపు నిలబడతాయి. అంటే సమాజంలో ఏదైనా మంచి జరుగుతుంది అంటే నువ్వు సంతోషించు. నువ్వు చెయ్యగలిగితే చెయ్యి. నువ్వు చెయ్యలేవు అనుకో, నీవు

శక్తిహీనుడవు అనుకో, అలా మౌనంగా ఉండి చూసి సంతోషించు. దానివల్ల కూడా పుణ్యం వస్తుంది. రమణమహర్షికి పదహారో సంవత్సరంలో జ్ఞానం వచ్చింది అనుకోండి, మరి అంతకు ముందు పుణ్యం, పాపం ఉంది కదా రమణమహర్షికి. మరి ఆ పుణ్యం పాపం ఎవరు అనుభవిస్తారు అని అడిగారు. అది రమణమహర్షి అనుభవించరు. ఎవరు అనుభవిస్తారు అంటే, రమణ నామం చేసుకున్న వాళ్ళు, రమణమహర్షి చెప్పే సందేశం విని ఆనందించేవాళ్ళు, ఆ రమణమహర్షి పదహారు సంవత్సరాల వరకూ చేసిన పుణ్యం మొత్తం వీళ్ళకే వస్తుంది. రమణమహర్షిని విమర్శించిన వాళ్ళకందరికి పదహారు సంవత్సరాలలో ఆయన చేసిన పాపం అంతా వస్తుంది. సరిపోయిందా మీకు అకౌంటు. మహాత్ములలో ఏవైనా దోషాలు ఉంటాయి అనుకోండి, ఆయనను తిడుతుంటే ఆ దోషాలు మనకు వస్తాయి. కాని మహాత్ములలో ఎక్కువ కళ్యాణగుణాలు ఉంటాయి కదా వాళ్లని స్తోత్రం చేస్తుంటే, వాళ్లని స్మరించుకుంటుంటే వాళ్ళ లోని మంచిగుణాలు మనకువస్తాయి. మాటల విషయంలో కూడా కఠినంగా మాట్లాడకూడదు. మృదువు గా మాట్లాడాలి, నొప్పి లేకుండా మాట్లాడాలి. హితవుగా మాట్లాడాలి, ప్రేమగా మాట్లాడాలి. మితంగా మాట్లాడాలి. మాట వల్ల కూడా పుణ్యం వస్తుంది. మాట వల్ల కూడా పాపం వస్తుంది. మాట వల్ల కూడా ప్రమాదం వస్తుంది. మాట వల్ల కూడా సుఖం వస్తుంది. అందుచేత ఏది మాట్లాడాలో, ఎక్కడ మాట్లాడాలో, ఎలా మాట్లాడాలో, ఎంతవరకు మాట్లాడాలో తెలుసుకుని మాట్లాడాలి. ఎవరికీ ద్రోహం తలపెట్టకు. ఎవరికీ హింస తలపెట్టకు. ద్రోహబుద్ధి ఉంటే నీకే నష్టం, నీ స్వరూపం దగ్గరకు నువ్వు వెళ్ళలేవు. ఎవరికైతే ద్రోహబుద్ధి ఉందో వాడు మహాత్ముడు అవ్వలేడు, దురాత్ముడు అవుతాడు. భగవంతుడు మన అందరికి తండ్రి అయినప్పుడు ఈ మానవులు అందరూ మనకు సోదరులు కాదా? నిన్ను ఎవరైనా విమర్శించవచ్చు, నిన్ను ఎవరైనా ద్వేషించవచ్చు, నిన్ను ఎవరైనా దూషించవచ్చు, వారు దూషిస్తున్నారు అని ద్రోహం చెయ్యకు అని భగవంతుడు వాసుదేవస్వామి చెబుతున్నాడు. నీకు ఎవరైనా అపకారం చేస్తే మళ్ళీ తిరిగి వాళ్లకి అపకారం చేయగల శక్తి నీకు ఉన్నప్పటికీ, ఆ శక్తిని నువ్వు నిగ్రహించుకో, ఆ శక్తిని నువ్వు కంట్రోల్ చేసుకుని తిరిగి వారికి ద్రోహం చెయ్యకు. యేసు క్రీస్తు అంటాడు ఎదుటివాడు నిన్ను ప్రేమిస్తుంటే తిరిగి వాడిని ప్రేమించటం అది కూడా ఒక గొప్పేనా? ఎదుటివాడు నిన్ను ద్వేషిస్తున్నప్పటికీ, ఎదుటివాడు నీకు ద్రోహం చేస్తున్నప్పటికీ, వాడిని ప్రేమించడమే గొప్ప. మీరు నన్ను ద్వేషిస్తున్నప్పటికీ ఆ ద్వేషానికి బదులు తిరిగి నేను ప్రేమను ఇవ్వగలిగితే అది గొప్ప అంటున్నాడు ఈశ్వరుడు. ద్రోహచింతన పనికిరాదు. ద్రోహచింతన ఉంటే మీకు నరకానికి దారి తీస్తుంది. జీవితం కూడా ద్రోహం తోటే కాలిపోతుంది. ద్రోహంతో కాపురం చెయ్యకు. అటువంటి నీచమైన గుణాలు ఉంటే నీకు

జ్ఞానం ఎలా కలుగుతుంది అయ్యా, నీ శరీరం ఎదగడం కాదు. నీ హృదయం ఎదగాలి. జ్ఞానంలో ఎదుగు, కాంతిలో ఎదుగు, ప్రకాశంలో ఎదుగు, బాగా ఎదుగుదల కావాలి. ద్రోహం లేని స్థితి ఎక్కడ ఉందో ఆ స్థితికి నువ్వు ఎదగాలి. ఆ స్థితికి నువ్వు చేరుకో. ద్రోహం లేని స్థితి నాకు ప్రసాదించమని భగవంతుని ప్రార్థించు. అది నిజమైన ప్రార్థన. అన్నం ఎంత సహజంగా మీరు తింటున్నారో, ప్రార్థన కూడా అంత సహజంగా మీరు చెయ్యాలి. అప్పుడు మనసు వికసిస్తుంది. భగవంతుడు చెప్పిన మాటలు మన హృదయంలో, మన రక్తంలో, ఒక భాగం అయిపోవాలి. అవి నిరంతరం మన హృదయంలో కాపురం ఉండాలి. ఈ మాటలు పుస్తకంలో ఉన్నాయి. పుస్తకంలో ఉంటే మనకు లాభం ఏమిటి? మన హృదయంలోకి రావాలి. కుండలో అన్నం ఉంది మనకు లాభం ఏమిటి? అది మనం తినాలి మనకు జీర్ణం అవ్వాలి. అప్పుడు కదా మనకు బలం వచ్చేది. నువ్వు అహంభావం పెంచుకోవద్దు. ఆడంబరం పెంచుకోవద్దు. నువ్వు ఆడంబరం పెంచుకుని, అహంభావం పెంచుకుని, సమాజంలో అందరూ నన్ను గౌరవించాలి అనేటువంటి తలంపులకి నువ్వు అవకాశం ఇస్తే నువ్వు దైవీసంపదకి దూరం అవుతావు అని భగవంతుడు వాసుదేవస్వామి అర్జునుడి తోటి చెబుతున్నాడు. వేదాలు చదువుకున్నా, భగవద్గీత చదువుకున్నా, భగవాన్ చెప్పిన మాటలు చదువుకున్నా, మీరు కలకాలం, చిరకాలం జ్ఞాపకం ఉంచుకోవాల్సిన మాటలు కొన్ని ఉంటాయి. నీకు ఎంత పాండిత్యం ఉన్నప్పటికీ, ఎంత వైభవంగా జీవితం ఈ జన్మలో నువ్వు గడుపుతున్నప్పటికీ, ఎన్ని జన్మలు జపాలు చేసినప్పటికీ, ఎంతకాలం అయితే మానవుడికి అహంకారం ఉందో, ఎంతకాలం అయితే మమకారం ఉందో, అంతకాలం తలంపులు ఎవరు ఆపు చేయలేరు. నాకు అహంకారం ఉన్నంతకాలం, నాకు మమకారం ఉన్నంతకాలం, నాకు తలంపులు వస్తూనే ఉంటాయి. తలంపులు వస్తున్నంత కాలం నాకు ఈ లోకం మీద భ్రాంతి పుడుతూనే ఉంటుంది. భ్రాంతి పుడుతున్నంత కాలం శవాలు వస్తూనే ఉంటాయి. మన హృదయంలో ఈశ్వరుడు ఉన్నాడు. ఆయన వాక్కుకు అందడు, మనసుకి అందడు. మన హృదయంలోనే సాక్షాత్తుగా ప్రకాశిస్తున్నాడు. మీకు విశ్వాసం ఉంటే నమ్మండి. భగవాన్ ఏమి చెప్పారంటే, మీరు వేదాలు పారాయణ చెయ్యటం వల్ల, తపస్సు చెయ్యటంవల్ల, ఎంతో సాధన చెయ్యటం వల్ల ఎటువంటి ఫలితం వస్తుందో, జీవితం అంతా కూడా దానాలు, ధర్మాలు, పూజలు చేయటం వల్ల ఎటువంటి ఫలితాలు వస్తాయో, అరుణాచలం కొండ వంక అలా చూస్తూ ఉంటే, లేదా మీ ఇంటి దగ్గర కూర్చొని ఆ కొండని స్మరిస్తూ ఉంటే అదే ఫలితంవస్తుంది. మనం నడుస్తుంటే మన బట్టల మీద దుమ్ము ఎలా అంటుకుంటుందో, అదే విధంగా అరుణాచలేశ్వరుడిని మీరు స్మరణ చెయ్యటం వల్ల, ధ్యానం చెయ్యటం వల్ల మీరు తరించటమే కాకుండా, మిమ్మల్ని కళ్యాణగుణాలు కూడా వరిస్తాయి అని భగవాన్

చెబుతున్నారు. మనసు అంటారు, జీవుడు అంటారు. మనసు అంటే ఏమిటి? జీవుడు అంటే ఏమిటి? ఇప్పుడు మనం అందరం నేను, నేను అంటున్నాము కదా, ఈ నేను తోటి మనసుని, జీవుడిని వెతుకుతాము. కాని ఈ నేనే జీవుడు, ఈ నేనే మనసు అన్న సంగతి మనకు తెలియటం లేదు. ఇక్కడే ఉంది మోసం అంతా కూడా. మీకు ఈ రహస్యం అర్థం అయితే కాని సృష్టి రహస్యం అర్థం కాదు.

జ్ఞానం అంటే ఏమిటి? నిన్ను నువ్వు తెలుసుకోవడానికి సహాయపడేది ఒక్కటే జ్ఞానం. మిగతాది అంతా అజ్ఞానమే. అది ఈ జన్మలో నీకు అర్థం కాకపోవచ్చు. కోటి జన్మలు తరువాత అయినా సరే ఇక్కడకురావాల్సిందే అంటున్నాడు పరమాత్మ. ఒక చిన్న రహస్యం చెబుతాను హృదయంలో దాచుకోండి. మనలో ప్రకృతి గుణాలు, రాక్షస గుణాలు ఏమైనా ఉన్నాయి అనుకోండి, ఈ రాక్షస గుణాలు, ఈ ప్రకృతి గుణాలు సహజంగా మనం పోగొట్టుకోవడానికి ప్రయత్నం చెయ్యాలి కాని, ఎవరైనా ఏమైనా అనుకుంటారు అనో, లేకపోతే గొప్పల కోసమో, ఈ రకంగా మనం సాధన చేసి వాటిని పోగొట్టుకుందాం అని చూస్తే అవి పోవు. సహజసిద్ధంగా పోగొట్టుకోవడానికి మీరు చూడాలి. ఎదుటి వాడిని దృష్టిలో పెట్టుకుని మనం ప్రకృతి గుణాలను పోగొట్టుకోవడానికి ప్రయత్నం చేస్తే అవి పోవు. పోయినట్టే కనిపిస్తాయి కాని పోవు. ఈ ప్రాసెస్ కనుక మీరు పాటిస్తే ఈ జన్మలో, ఈ శరీరం ఉండగానే, ఈ లోకంలో ఉండగానే అమృతతత్వాన్ని పొందుతారు. అప్పుడు చావు అనేదానికి ఇంక మీరు భయపడే సమస్య లేదు. నువ్వు నేను, నేను అని అంటున్నావు, నేను అనే తలంపు నీకు ఉంది కదా, అది ఎక్కడ పుడుతోందో నువ్వు చూడు. అది ఆత్మలో పుడుతోంది. దాని పుట్టుక స్థానాన్ని నువ్వు చూడగలిగితే నీకు ఆత్మ దర్శనం అవుతుంది. అదే మన గమ్యం. ఆ గమ్యానికి చేరుకోవాలి. సత్యం సింపుల్‌గా ఉంటుంది కాని సింపుల్‌గా ఉండటం ఏ మనిషికి ఇష్టం ఉండదు. అందుకే సత్యం అందదు. మనకు ఏమి కావాలి ఆడంబరం కావాలి, సత్యానికి ఆడంబరం లేదు. అందుకే సత్యం మనకు అందటం లేదు. ఒక మనిషిలో ఉండే ఈశ్వర అంశ చూస్తే, ఏదైనా గొప్పగుణాలు కనుక చూస్తే, వాడు పూర్వజన్మలో ఎంత శ్రమిస్తే ఆ గుణాలు వచ్చాయో అని మీరు అనుకోండి.

మనలోని మంచి గుణాలు అన్నీ దేవతలు. మనలోని చెడ్డ గుణాలు అన్నీ రాక్షసులు. కురుక్షేత్రం మన హృదయంలోనే ఉంది, మీరు ప్రాపంచిక సుఖాలను ఏవైతే పొందుతున్నారో, దానికొక కారణం ఉంటుంది. ఆ కారణం పోతే ఈ సుఖం కూడా పోతుంది. కారణానికి అతీతమైనది, ప్రకృతికి అతీతమైనది ఆత్మ సుఖం ఒక్కటే. ఆత్మ సుఖానికి మించింది, ఆత్మ యొక్క వైభవానికి మించింది, ఈ లోకంలో కాని, పరలోకంలో కాని ఏది లేదు. వైకుంఠంలో కాని, కైలాసంలో కాని అటువంటి సుఖం మీరు పొందలేరు. మీకు ఎప్పుడైనా సంతోషం

వస్తోందా? మీ సంతోషానికి కూడా ఒక కారణం ఉంటుంది. ఆ కారణం పడిపోతే ఈ సంతోషం కూడా పడిపోతుంది. కారణం కనిపించిందా అది అబద్ధం. ఒక్క ఆత్మ సుఖానికే కారణం కనపడదు. ఇక్కడ రాక్షసగుణాలను గురించి భగవంతుడు చెపుతున్నాడు. దంభః, దంభః అంటే వేషం. భాష. దంభంలో ఉన్న మనిషి ఏమిటంటే ఒక రహస్యం గుర్తుపెట్టుకోండి. మీరు దానాలు చేస్తూ ఉంటారు, దంభం ఉన్న వాళ్ళు కూడా దానాలు చేస్తూ ఉంటారు. ఎలా చేస్తారు వీళ్ళు దానాలు? ఎదుటివాడి సుఖం కోసం, ఎదుటి వాడి శాంతి కోసం వీళ్ళు దానాలు చెయ్యరు. దేశం అందరూ నేను దానం చేసినట్టు చెప్పుకుంటున్నారా? లేదా? అని చూస్తాడు. భగవంతుడు ఈ క్వాలిటీ గురించి ఎంత వివరంగా చెపుతున్నాడో చూడండి. మీరు ఎవరికైతే దానం చేస్తున్నారో, వాళ్ళు సుఖపడాలి అని కాని, వాళ్ళు శాంతి పొందాలి అని కాని మనసులో కోరుకోరు. వాళ్ళ సుఖం అక్కర్లేదు, వాళ్ళ శాంతి అక్కర్లేదు. మనం దానం చేసినట్టు అందరూ చెప్పుకుంటున్నారా లేదా అనేది వీళ్ళు చూసుకుంటారు. ఇది కూడా రాక్షసగుణమే అంటున్నాడు భగవంతుడు. వాడు కొన్ని కోట్ల రూపాయలు దానం చేసినా కూడా వాడు రాక్షసుడే. ఎక్కడికి తీసుకెళ్ళి పడేస్తున్నాడో చూడండి. మామూలుగా వాడు దానం చేశాడు, వాడు దానం చేశాడు అని బయట అనుకొంటారు. ఎందుకు చేశాడు? గొప్పల కోసం చేశాడు. నీ సుఖం కోసం చెయ్యలేదు. నువ్వు బాగుపడటం వాడికి ముఖ్యం కాదు, వాడి గొప్ప వాడికి ముఖ్యం. అందుచేత వాడు కూడా రాక్షసుడే అంటున్నాడు భగవంతుడు వాసుదేవస్వామి. ఎన్ని జన్మలు సాధన చెయ్యాలో, మీ హృదయంలో ఉన్న రజోగుణం, తమోగుణాల నుంచి బయటపడటం కోసం ఎంత తపించాలో? కొంతమంది ఎదుటి వాళ్ళకి అర్థం అవ్వటం కోసం చెప్తారు. నేను గొప్ప పండితుడ్ని అనిపించుకోవటం కోసం చెబుతారు. వాళ్ళు కూడా రాక్షస మనుషులే అని చెబుతున్నాడు భగవంతుడు వాసుదేవస్వామి.

డంభం ఉన్నవాడికి లోపల సహజంగా అల్పత్వం ఉంటుంది. వాళ్ళు తక్కువ వాళ్ళం అనివాళ్ళకి తెలుసు. డంభం ఉన్న మనిషి తనని తాను విమర్శ చేసుకోడు. తనని తాను దర్శించడు. తనలోని క్షుద్రత్వాన్ని దర్శించలేక, ఎదుటివారు మటుకు మనలని మహాత్ముడు అనుకోవాలని చూస్తాడు, నేను దురాత్ముడనే అవ్వటానికి, కాని ఎదుటివాడు మటుకు నేను మహాత్ముడు అనుకోవాలనే తలంపుతో ఎవడు ఉంటాడో, వాడు కూడా రాక్షసుడే అంటున్నాడు భగవంతుడు వాసుదేవస్వామి. వాడికి చెడ్డగుణాలు ఉండవచ్చు. కాని వాటిని పోగొట్టుకోవటానికి ప్రయత్నం చెయ్యడు సరికదా, ఎదుటివాడు తనని పూజించాలి అని, తనని గౌరవించాలి అని, ఇటువంటి భావాలతో ఉంటాడు డంభంలో ఉన్న మనిషి అంటున్నాడు భగవంతుడు వాసుదేవస్వామి. భగవంతుని చూస్తూనే భయం వేస్తుంది

వాడికి, అందుకే ఏదో విధంగా ఎస్కేప్ అవ్వాలని చూస్తాడు. ప్రజలందరూ సుఖంగా ఉండాలి. ప్రతీ వ్యక్తి కూడా హ్యాపీగా ఉండాలి. ఎవరికీ దుఃఖం కలగకూడదు అనే భావాలు హృదయపూర్వకంగా మీకు ఎప్పుడైనా వచ్చాయా? నిన్ను నువ్వు పరిశీలించుకో. ఎదుటివాడు నిన్ను పొగడాలని నువ్వు ఎప్పుడు ప్రయత్నం చెయ్యకు. నిన్ను నువ్వు తెలుసుకోవడానికి ప్రయత్నం చెయ్యి. నీవు జపం చేసినా, ధ్యానం చేసినా నీకోసం అని తెలుసుకోవయ్యా. సత్పురుషుల లక్షణం ఏమిటంటే ఇది మనసులో ఉంచుకోండి, పైకి ఎంతోకొంత ప్రయత్నం వాడు చేస్తున్నప్పటికీ, కేవలం దైవానుగ్రహం మీద భగవంతుడి మీదే నూటికి నూరుపాళ్ళు ఆధారపడి ఉంటాడు. వాడు జ్ఞాని. తాను ప్రయత్నం చేస్తాడు కాని తన ప్రయత్నం మీద ఆధారపడి ఉండడు. దేనిమీద ఆధారపడి ఉంటాడు? దైవం యొక్క దయ మీద ఆధారపడి ఉంటాడు. ఆధ్యాత్మికంగా అభివృద్ధి అవ్వాలంటే ఇది ఇక్కడ సీక్రెట్. సాధన చెయ్యాలి, సాధన చేస్తున్నాం అనే భావన లేకుండా సాధన చెయ్యాలి. దేనిమీద ఆధారపడి ఉండాలి? కేవలం పరిపూర్ణంగా ఈశ్వరుడి మీద మీరు ఆధారపడి ఉండాలి. ప్రశ్నించడానికి వీలులేదు. ఎదురుచూడటమే. అప్పుడు ఆయన అనుగ్రహం మీకు కలుగుతుంది. మాకు డబ్బుకి డబ్బు ఉంది. కీర్తికి కీర్తి ఉంది. మళ్ళీ గౌరవానికి గౌరవం ఉంది. చదువుకి చదువు ఉంది అని ఈ రకమైన భావాలతో మనం జీవిస్తూ, నాకు ఇది ఉంది, నాకు అది ఉంది అంటూ నిరంతరం మననం చేస్తూ ఉంటే, అది కూడా రాక్షస స్వభావం అని భగవంతుడు చెబుతున్నాడు. లోకానికి సంబంధించిన వస్తువుల మీద నీకున్న విశ్వాసం కూడా దైవం మీద లేదు. చదువు ఎక్కువ ఉన్నవాడు. డబ్బు ఎక్కువ ఉన్నవాడు, అధికారంలో పెద్దవాడు, ఈ మూడు గుణాలు ఉన్నవాడు ఏమి చేస్తాడు అంటే, ఎదుటి వాళ్లని ఎలా కించపరుద్దాం. ఎదుటి వాడిని ఎలా అగౌరవ పరుద్దాం అనే మనస్తత్వం వీళ్లకి ఎక్కువగా ఉంటుంది. అందుచేత వీళ్ళు కూడా రాక్షసులే అంటున్నాడు భగవంతుడు వాసుదేవస్వామి.

దంభః దర్పః అభిమానశ్చ అభిమానం అంటే ఒకరకమైన గర్వం. బడిలో పిల్లలు ఉన్నారు అనుకోండి వాళ్లకి తెలియకపోయినా ఒకొక్కసారి తెలిసినట్టు నటిస్తారు. వాళ్లకి తెలియలేదు అని టీచర్‌ని అడగరు. నాకు తెలియలేదు మాష్టారు అని అడగటానికి ఏమి అడ్డు వస్తుంది ? అభిమానం అడ్డు వస్తుంది. అది కూడా రాక్షసగుణమే. అభిమానం కూడా అసుర గుణాలలోకే వస్తుంది. నీకు తెలియని విషయం పెద్దలని ఆశ్రయించి, పెద్దలకి సేవ చేసి, అడిగి తెలుసుకో, అంతే కాని అడిగితే మన గౌరవం పోతుందేమో అనుకొంటే అది నీకు ఎలా తెలుస్తుంది. నటన పనికి రాదు అంటున్నాడు భగవంతుడు వాసుదేవ స్వామి. అభిమానానికి దూరంగా ఉండు, దర్పానికి దూరంగా ఉండు. డంభానికి దూరంగా ఉండు. ఇవన్నీ రాక్షస గుణాలు. నాకు ఎంతవరకు తెలుసు, నాకు ఎంతవరకు తెలియదు

అన్న సంగతి తెలియటానికి కూడా శ్రవణం చెయ్యాలి కదా. శ్రవణం చెయ్యకుండా ఎలా తెలుస్తుంది. మన హృదయంలో ఉన్న ఆత్మ మనకు ఎందుకు అందటం లేదు, మీ హృదయంలో భగవంతుడు ప్రకాశిస్తున్నాడు కదా, ఎందుకు అందటం లేదు? మనలో ఉన్న రాక్షసగుణాలు వల్ల ఆయన మనకు అందటం లేదు. వాటి వల్ల తనకు తాను అపకారం చేసుకోవటమే కాకుండా, ఎదుటి వాడికి కూడా అపకారం చేసి తీరతాడు. అందుచేత నీకు ఇహం చెడిపోతుంది. పరం చెడిపోతుంది. మరి, ఉన్నది ఒక్కటే అనుకోండి ఎవరి మీద కోపగిస్తారు. ఎదుటి వాడికి నువ్వు చేసే మంచి అంతా కూడా నీకే తిరిగి వస్తుంది. ఎదుటి వాడికి నువ్వు చేసే చెడు అంతా కూడా నీకే తిరిగి వస్తుంది. ఇది ఎటర్నల్ లా.

జీవకోటి అందరిలో జఠరాగ్నిగా ఉండి, అన్నం తినేవాన్ని నేనే. మీరు నాకు పెట్టినట్టా?ఈశ్వరుడికి పెట్టినట్టా?మీరు ఎవరికైనా పెడితే గౌరవం కోసం పెడుతున్నారా? ఈశ్వరుడు తింటున్నాడు అని పెడుతున్నారా? నోరు మీకు కనిపించవచ్చు. కాని లోపల తినేవాడు ఈశ్వరుడే అనే భావన ఉందా? భావనలో శుద్ధి లేకపోతే హృదయానికి శుద్ధి రాదు. భావనలోబలం లేకపోతే హృదయానికి బలం రాదు. భావన చాలా ప్రధానం. మిమ్మల్ని పైకి తీసుకెళ్లినా భావన. అధోగతి పాలు చేసినా భావన. అందుకే సత్పురుషుల సహవాసం. సత్పురుషుల సహవాసం మీరు చేస్తుంటే, మీకు తెలియకుండా వాళ్ళ vibrations మీలో పని చేస్తాయి. రమణస్వామి ఏమన్నారు అంటే జ్ఞానులు ఏమి చెయ్యనక్కరలేదు అయ్యా , దేహం ధరించి ఉంటే చాలు అన్నారు. అదే మహోపకారం. నీ లోపల కుళ్ళు పెట్టుకుంటే, హృదయంలో కుళ్ళు పెట్టుకుంటే, నువ్వు చదివిన పుస్తకానికి వక్ర భాష్యం చెప్పకపోతే మంచి భాష్యం చెబుతావా? నీ హృదయంలో దోషం ఉన్నప్పుడు, భగవంతుడు చెప్పిన మాటలు కూడా మీరు వక్రంగానే తీసుకుంటారు. జ్ఞాని చెప్పిన మాటలు మీకు వక్రంగానే కనిపిస్తాయి. ఎందుచేత? ఆ మాటల్లో దోషం లేదు కాని నీ హృదయంలో దోషం ఉంది కాబట్టి నీకు వక్రంగా కనిపిస్తుంది. అందుకే వక్ర భాషలో చెబుతారు. ఏవండీ, మన అబ్బాయిలు రక్షిస్తారు, మన మనవలురక్షిస్తారు, మన దగ్గర డబ్బులు రక్షిస్తాయి అనే భావన మనకు ఉంది కానీ భగవంతుడు మనలని రక్షిస్తాడు అని మనం ఎవరిమైన అనుకుంటున్నామా? భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు. వాడు నన్ను రక్షిస్తాడు అని ఎవరికైనా భావన ఉందా?ఆ భావన కనుక మీకు ఉంటే, భయం ఎందుకు పుడుతుంది మీకు. ఈశ్వరుడి యొక్క కృప మీద మీకు నమ్మకం లేదే, కృప లేకుండా ఈశ్వరుడు ఉంటాడా? శక్తి లేకుండా ఈశ్వరుడు ఉంటాడా?మనం ఏదైతే నామం చేస్తున్నామో వాడు శక్తి కలవాడు. అయితే ఆ శక్తి మీద మనకు విశ్వాసం లేదు. ఇంక మనం భక్తులం ఎలా అవుతాము? సోదరమహాశయులారా! ఒక చిన్న రహస్యం. మీరు ఇంటికాడ కూర్చొని జరిగిపోయిన

సంఘటనని అస్తమాను జ్ఞాపకం పెట్టుకుంటే అంతకంటే అపరాధం మరొకటి లేదు. జరిగిపోయిన సంఘటనని మీరు ఎన్ని సార్లు జ్ఞాపకం తెచ్చుకోండి దాని వలన మీకు టైం వేస్ట్, మీరు భక్తికి దూరం అవుతారు. క్రోధం గురించి చెబుతున్నాడు. క్రోధం గురించి ఎందుకు చెబుతున్నాడు ? దాని వలన నువ్వు నష్టపోతావు, ఎదుటివాడిని నష్టపెడతావు. ఈ కోపం ఎప్పుడు వస్తుంది అంటే కోరిక లోంచి కోపం పుడుతుంది. నాకు కోరిక ఎప్పుడైతే నెరవేరలేదో, నెరవేరని కోరిక లోంచి కోపం పుడుతుంది. వీడికున్న కోరిక నెరవేరటానికి ఎవరైతే అడ్డు వస్తున్నారో వాళ్ళు అందరి మీద కోపం పుడుతుంది. మీరు అందరూ నాకు చెడ్డ చేస్తున్నారు అనుకోండి మాట వరసకి దానిని నేనేమీ ప్రతిఘటించను అనుకోండి. నన్ను అప్పుడు ఈశ్వరుడు తీసుకెళ్లి తన దగ్గర సింహాసనం మీద కూర్చోబెట్టుకుంటాడు. నీకు ఎవరైనా చెడ్డ చేస్తుంటే, నువ్వు ప్రతిఘటించకపోతే అది కూడా సాధనలో భాగమే అంటున్నాడు భగవంతుడు వాసుదేవస్వామి. జయం అంటే ఏమిటి? నాలోని దుర్గుణాలు నాశనం అయ్యి, సద్గుణాలు గెలుపొందినప్పుడు నాకు జయం కలుగుతుంది. అది జయం అంటే. కోపం కూడా తలంపే. తలంపు లేకుండా ఎవరికైనా కోపం వస్తుందా? నిజమైన స్వార్థపరులు ఎవరంటే భక్తులే స్వార్థపరులు అటండి. ప్రహ్లాదుడు చెప్పాడు నేను చెప్పలేదు భాగవతంలో, మోక్షాన్ని పొందటం కంటే మించిన స్వార్థం ఏముంది అన్నాడు. భక్తి పారవశ్యం కావాలి. భక్తి చాలా నిర్మలంగా ఉండాలి. ఒక్క భక్తి చాలు తాను బయటపడటానికి. ఒకటి దంభః, రెండు దర్పః, మూడు అభిమానః, నాలుగు క్రోధః. అన్నీ కలినంగా మాట్లాడుతాము. అన్నీ అసభ్యంగా మాట్లాడుతాము. ఎక్కడ ఎలా మాట్లాడాలో మనకు తెలియదు. హితంగా మాట్లాడాలి, మితంగా మాట్లాడాలి, అతిగా మాట్లాడకూడదు, నువ్వు మాట్లాడేది హితంగా మాట్లాడాలి. నువ్వు ఏమి మాట్లాడినా అతిగా మాట్లాడకూడదు. మితంగా మాట్లాడాలి అని రమణమహర్షి చెప్పేవారు.

**హే భగవాన్, జయ భగవాన్, ప్రియ భగవాన్, ప్రభు భగవాన్.**
**హే భగవాన్, జయ భగవాన్, ప్రియ భగవాన్, ప్రభు భగవాన్.**
**హే భగవాన్, జయ భగవాన్, ప్రియ భగవాన్, ప్రభు భగవాన్.**

భగవాన్ నామం స్మరిస్తున్నప్పడు, భగవాన్ మాటలు చెబుతున్నప్పడు జన్మాంతర అనుబంధం ఏదో నా హృదయంలో కదులుతూ ఉంటుంది, ఆ జ్ఞాపకాలు హృదయంలో మెదులుతూ ఉంటాయి. భగవాన్‌తో నాకు అనుబంధం ఉన్నమాట నిజమే కాని అది ఎప్పడు కలిగిందో, ఏ జన్మలో కలిగిందో నాకు తెలియదు. భగవాన్‌తో అటువంటి ఆత్మీయ అనుబంధం ఉంది.

# గురుపూర్ణిమ - సద్గురు స్మరణ

**ఈశ్వరోగురురాత్మేతి మూర్తి భేద విభాగినే।**

**వ్యోమవత్ వ్యాప్త దేహాయ దక్షిణా మూర్తయే నమః॥**

దైవము, గురువు, ఆత్మ, మూడు తత్త్వపరంగా ఏక వస్తువే! అనగా గురువు, దైవము, ఆత్మ, పర్యాయ పదములే! గురువు అంటే ఒక శరీరము కాదు, ఒక వ్యక్తి కాదు, చిదాకాశ స్వరూపం. రూపుదాల్చిన చైతన్యమే సద్గురువు. గురువు అనేది ఏకవచనమే గాని, బహువచనము కాదు. ఆత్మ అనంతము కాబట్టి, దేవుడు, గురువు, జగత్తు, జీవుడు, మున్నగు సకలమూ ఆత్మే! అనగా గురువే! సద్గురువు అంటే అనంత చిత్ సాగరం, అమృతస్థితి, పరమశాంతి. ఈ సృష్టిలో అమూల్య జ్ఞాన రత్నము గురువు, నిధులన్నింటినీ మించిన పెన్నిధి. ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు, భగవద్గీత, ఏ పరమసత్యాన్ని వివరిస్తున్నాయో, ఆ సత్యాన్ని బుద్ధిపరంగా కాకుండా, స్వరూపంగా, అనగా 'తాను'గా, 'నేను'గా, అనుభవైకవేద్యం చేసుకున్న మహనీయుడే, రూపుదాల్చిన సద్గురువు. కేవల సద్వస్తువే ఆయాకాలంలో, సద్గురు రూపు దాల్చి ఈ భూమిపై సంచరిస్తూ ఉంటుంది. ఆధునిక కాలంలో అట్టివారే భగవాన్ శ్రీరమణమహర్షి, సద్గురు శ్రీనాన్నగారు, శ్రీ రామకృష్ణ పరమహంస, షిరిడీ సాయిబాబా మున్నగు అనేక రూపాలు! మన సనాతన సంప్రదాయంలో గురు, శిష్య సంబంధం విడదీయరానిదే! పసిబిడ్డకు, తల్లికి, మధ్య ఉన్న సంబంధము వంటిదే గురు శిష్య సంబంధం. సర్వవ్యాపి, సర్వాంతర్యామి, అయిన చైతన్యాన్నే, భక్తులు భగవంతుడనీ, శిష్యులు గురువనీ, జ్ఞానులు జ్ఞానమని, యోగులు బ్రహ్మమని వక్కాణిస్తారు. సద్గురువు శ్రీ నాన్నగారు శరీరం ధరించి ఉన్న కాలంలో మనము కూడా ఉండడం, వారి దివ్య సమక్షాన్ని అనుభూతి చెందడం, వారి కృపకు పాత్రులమవడం, అనేక జన్మల పుణ్య బలమే! సద్గురు తత్త్వాన్ని అనేక సందర్భాలలో శ్రీ నాన్నగారు ఈవిధముగా ప్రవచించారు "జీవుడు తన స్వస్థితికి చేరే ప్రయాణంలో అవరోధాలను తొలగించి, ప్రయాణాన్ని తేలిక చేసి, గమ్యాన్ని సుగమం చేసే, అద్భుత శక్తి గురువు. మన ఆధ్యాత్మిక ప్రయాణంలో ప్రతిక్షణం మార్గదర్శిగా నిలిచి, అజ్ఞాన జనితమైన జనన-మరణ సంసార చక్రము నుండి విడుదల పొందుటకు మార్గము చూపి, మృత్యు భయాన్ని నివారించి, స్వరూప అమృతస్థితిలోకి మేలుకొలిపే, మహితవరం సద్గురువు. మనము ఏ మార్గాన్ని అనుసరించినా, మన గురువు ఎవరైనా? మనోనాశం ముఖ్యం. మనస్సు నశించకుండా, స్వరూపానుభూతి

కలుగదు అని సద్గురువు శ్రీ నాన్నగారు నొక్కి వక్కాణించేవారు". గంగానదిలో స్నానం చేస్తే పాపాలు పోతాయి అంటారు, కాని గుర్వనుగ్రహానికి పాపపుణ్యాలను, నేను చేసాను అనే కర్తృత్వ బుద్ధిని పోగొట్టే శక్తి ఉంది. సద్గురువు అంటే విముక్తి ప్రదాత. సద్గురువు ప్రభావం మానవాళిపై అత్యంత బలీయంగా ఉంటుంది. గురువు తన చూపు, వాక్కు, చేతల ద్వారా విషయాలవైపు ఆకర్షింపబడే మనస్సును, దాని మూలంలోకి అంతర్ముఖం చేస్తారు. గురువు హృదయంలో స్వరూపంగా ఉన్న పరమశాంతిని, అమృతస్థితిని, నేనుగా అనుభవైక వేద్యం చేసుకోవడానికి సహకరిస్తారు. సద్గురు బోధ దేశ, కాల, కార్య, కారణాలకు, అతీతము కాబట్టి అది ఈ సువిశాల సృష్టి అంతటికీ వర్తిస్తుంది. గురువు చేసే నిజమైన మహిమ, సత్యాన్వేషి యొక్క అహంకారాన్ని మ్రింగేయడమే! పరమ ప్రేమ మూర్తి, సహజరూపశిల్పి అయిన గురువు ఆచరించినదల్లా ధర్మమే అవుతుంది. సకల చరాచర జగత్తును తనకు అభిన్నంగా దర్శిస్తూ, సర్వులను అకారణంగా ప్రేమించే, గురు సమక్షమే ఆధ్యాత్మిక ఆహారం. సద్గురువు పెద్ద ఓడ, దానిలో ప్రవేశించినవారు గమ్యాన్ని చేరి తీరుతారు. గురువు చేసే పని లోపలిదే. గురు వాక్యమే గురువు. గురువు పట్ల సజీవ విశ్వాసం ఉండాలి. ముక్త గురువే సాధన, సాధ్యము రెండూ! జీవునికి వాస్తవంగా తాను ఎవరో తెలుసుకోవాలన్న తపన మరియు దానికి తగిన ప్రయత్నము చేయాలనే బుద్ధి కలగడం గుర్వనుగ్రహానికి గుర్తు. వరలబ్ధమైన మానవ జన్మ లభించడం, సద్గురువు లభించడం, మనకు మహిత వరాలు. మనలో నెలకొనియున్న అజ్ఞానాంధకారాన్ని తొలగించి, జ్ఞాన జ్యోతిని వెలిగించి, స్వరూపానుభూతికి దిశ చూపించి, మార్గ నిర్దేశం చేసిన, మహనీయుడైన సద్గురు శ్రీనాన్నగారి వైభవం గురించి ఏమి చెప్పగలం? ఎంతని చెప్పగలం? మనము గురువుకు ఇచ్చే గొప్ప బహుమానం, సదా ఆత్మ నిష్ఠలో ఉండడమే! తనను ఆశ్రయించిన వారి అశాంతిని, దుఃఖాన్ని, అజ్ఞానాన్ని తొలగించి సత్యము వైపు నడిపించిన సద్గురువు శ్రీనాన్నగారు లభించడం నిజంగా పరమాత్మ కృప! గురువును దేహమాత్రుడిగా భావిస్తూ ఉంటే, మనకు గురుతత్త్వం అర్థం కానట్లే! సద్గురువును సేవిద్దాం! జన్మ రాహిత్యాన్ని సాధిద్దాం! గురువు నడిచిన మార్గము, గురుబోధ, గురువు ఆదేశించిన పద్ధతి, మన జీవిత విధానం కావాలి.

**(ది॥ 05-07-2020 గురు పూర్ణిమ సందర్భంగా)**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**



## శ్రీమద్భగవద్గీత

### (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణముల నుండి)

**- సేకరణ : బేబీ, హైదరాబాద్**

**సర్వ ధర్మాన్ పరిత్యజ్య మాం ఏకం శరణం వ్రజ ।**
**అహంత్వా సర్వ పాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః ॥ 18-66 ॥**

తాత్పర్యము: సర్వ ధర్మములను, అనగా సమస్త కర్తవ్య కర్మలను నాకు సమర్పించి సర్వ శక్తిమంతుడను, సర్వాధారుడను, పరమేశ్వరుడను, ఐన నన్నే శరణుజొచ్చుము. అన్ని పాపములనుండియు నిన్ను నేను విముక్తుని గావించెదను. నీవు శోకింపకుము.


సర్వ ధర్మాన్ పరిత్యజ్య - సామాన్య ధర్మాలు, సామాన్య కర్మలు విడిచిపెట్టేయి, నన్ను శరణాగతి వేడు, అంటున్నాడు పరమాత్మ. మామూలుగా తల్లితండ్రులను గౌరవించాలి అని చెపుతాము. వాళ్ళని గౌరవించవలసిందే. కాని ప్రహ్లాదుడు భగవంతుడి కోసం తండ్రి మాట కాదన్నాడు. తండ్రితో నువ్వు చెప్పేది కరెక్ట్ కాదు, ఈ విషయంలో నువ్వు చెప్పింది అంగీకరించను అన్నాడు. హిరణ్యకశిపుడు హరి ఎవడు,హరి లేడు అన్నాడు. తండ్రి అయినప్పటికీ, నువ్వు చెప్పిన మాట నేను అంగీకరించను అన్నాడు ప్రహ్లాదుడు. మంచి చెపితే వింటాడు. భగవంతుడికి దూరం అయ్యే మాటలు చేపితే తండ్రి పట్ల గౌరవం ఉన్నా నువ్వుఆ మాటలు విడిచిపెట్టేయాలి. తండ్రిని చూడటం గౌరవించటం అనేది సామాన్య ధర్మం. కాని భగవంతుడి కోసం తల్లితండ్రులను విడిచిపెట్టినా పొరపాటు లేదు అని చెపుతున్నాడు భగవంతుడు. సామాన్య ధర్మాలు, సామాన్య కర్మలు, నా కోసం విడిచిపెట్టినా దోషం లేదు. ఒక ఉన్నత స్థితి పొందటానికి విడిచిపెడుతున్నావు! ఒక ఉజ్జ్వలమైన భవిష్యత్తు కోసం విడిచిపెడుతున్నావు! ఆత్మజ్ఞాన సముపార్జనకి విడిచిపెడుతున్నావు. తల్లితండ్రులను చూడటం అనేది సామాన్య ధర్మం, అది రైటే. కాని భగవంతుడి కోసం ఏది విడిచిపెట్టినా,

ఏది త్యాగము చేసినా అది దోషము కాదు.

మాం ఏకం శరణం వ్రజ - నన్ను ఒక్కడిని మాత్రమే అంటే భగవంతుడిని నమ్మమని చెప్పటంలేదు, భగవంతుడిని ఒక్కడిని మాత్రమే నమ్మమంటున్నాడు. అసలు భగవంతుడి యొక్క వైభవం తెలియటానికి ఎప్పుడైనా అసలు శ్రవణం చేస్తే కదా! మనకి తింటే రుచి తెలుస్తుంది, వింటే ఔన్నత్యం తెలుస్తుంది. మేమేగొప్పవాళ్లము అని మీరు అనుకుంటూ ఉంటే ఇంక ఈశ్వరుడు ఏమిటి! ఇంకో గంటలో ఏమి జరుగుతుందో మనకి తెలియదు, రేపు ఎలా ఉంటామో మనకి తెలియదు. అంతా మాకే తెలుసు అంటే అర్థం ఏమిటి. అసలు మనకి దిక్కు అంటూ ఏమైనా ఉంటే, అదిభగవంతుడి పాదాలే! అంతకంటే ఇంకో దిక్కు ఏమీ లేదు. మనం తరించే వరకూ ఆయన పాదాలే దిక్కు.

నా పట్ల నువ్వు విశ్వాస పాత్రుడవు అయ్యి ఉంటే, నా పట్ల నువ్వు డివోటెడ్‌గా, డెడికేటెడ్‌గా ఉంటే, లోకానికి సంబంధించిన పని అయినా నన్ను స్మరించుకుంటూ కనుక నువ్వు చేస్తుంటే, అప్పుడు పూర్వం వేలాది జన్మలనుంచీ నీకు వచ్చిన అలవాట్లు, నీకున్నటువంటి బలహీనతలని అన్నింటినీ తొలిగించే భాధ్యత నాది. నువ్వు నా పట్ల విశ్వాస పాత్రుడవు అయ్యి ఉంటే, నన్ను శరణు వేడుకొంటే నీ శారీరకఆరోగ్యాన్ని, మానసికఆరోగ్యాన్ని కాపాడి, నిన్ను శుభ్రంగా కడిగేస్తాను. శరీరానికి ఆరోగ్యం ఉండాలి, మనస్సుకి శాంతి ఉండాలి. ఆ రెండూ ఉంటే, నీకు సాధన బాగా జరుగుతుంది. అంటే దైవాభిముఖంగా నీ జీవితం ప్రయాణం సాగుతుంది. నీ శారీరకఆరోగ్యం పోగొట్టే బలహీనతలు, నీ మనశ్శాంతి పోగొట్టే అలవాట్లు, ఆపాపాలు, దోషాలు అన్నింటిలోనుంచి నిన్ను విడిపించి, నీకు మోక్షము, శాశ్వతమైన శాంతి, శాశ్వతమైన సుఖం, నిర్వాణసుఖం, దుఃఖస్పర్శ లేనటువంటి ఆనందం నీకు ప్రసాదించే బాధ్యత నాది అర్జునా, నీకు వాగ్దానం చేసి చెపుతున్నాను అంటున్నాడు పరమాత్మ

అహంత్వా సర్వ పాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః - మోక్షం అంటే, అజ్ఞానం లోంచి, అవిద్యలోనుంచి, బంధంలో నుంచి, దోషాల లోనుంచి, పాపాల లోనుంచి, బలహీనతలలో నుంచి, అన్నింటిలోనుంచి విడుదలచేసి, నిన్ను ఏ విషయాలు అయితే బంధిస్తున్నాయో, వాటన్నిటిలోనుంచి నిన్ను విడుదల చేసి, నీకు మోక్షాన్ని, శాంతిని, నిర్వాణసుఖాన్ని నా చేతితోటి ఇస్తాను. ఏ సుఖం పొందిన తరువాత,అంతకంటే మించిన సుఖం లేదు అని నీకు తెలుస్తుందో, ఏ శాంతిని పొందిన తరువాత అంతకు మించిన శాంతిని కోరుకోవో, అటువంటి శాంతిని, సుఖాన్ని, ఇంక జన్మలు లేనటువంటి, ఈ శవాలను మోయవలసిన అవసరం లేనటువంటి పరమపదాన్ని నా చేత్తోటి నీకు ప్రసాదిస్తాను అర్జునా! అంత వివరంగా భగవంతుడు చెపుతుంటే, ఇంకేమి చెప్పమంటారు!



# అరుణాచల మహత్మ్యం
## అక్షరమణమాల

**ఎవరికిగా నన్ను ఏలితి, విడిచిన**

**అఖిలము నిందించు నరుణాచలా!**

తాత్పర్యం: నన్ను అద్వైత శిఖరం మీద అధిష్టింప చేసావు. ఎందుకు చేసావు? ఎవరికోసం చేసావు? ఇంత చేసిన నీవు, ఇప్పుడు నన్ను మధ్యలో విడిచి పెడితే ఈ లోకము నిన్ను నిందిస్తుంది అరుణాచలా!

ఓ అరుణాచలేశ్వరుడా, ఎవరికిగా నన్ను ఏలితివి - నన్ను ఎందుకు తీసుకొచ్చావు అరుణాచలా? నేను తిరుచ్చుళిలో ఉండేవాడిని, అక్కడ చదువుకునే వాడిని. నీకు ఎవరూ దొరకలేదా! ఈ లోకంలో ఎంతోమంది జీవులు ఉన్నారు. నీకు నేనే దొరికానా, ఇంకెవరూ దొరకలేదా! ఎందుకు తీసుకొచ్చావు నన్ను ఈ అరుణాచలం? మా అమ్మకు నన్ను దూరం చేసి, మా ఇంటికి నన్ను దూరం చేసి, మా ఊరికి నన్ను దూరం చేసి, ఈ అరుణాచలం ఎందుకు నన్ను తీసుకొచ్చావు.నువ్వు ఎవరి కోసం తీసుకొచ్చావు, ఎందుకు తీసుకొచ్చావు అరుణాచలా! నా చేత ఏమి పని చేయించాలని తీసుకొచ్చావు. నా కొంప ముంచి ఇక్కడికి తీసుకొచ్చావు అరుణాచలా!

విడిచిన అఖిలము నిందించును అరుణాచలా! పోనీ తీసుకొస్తే తీసుకొచ్చావు. ఇప్పుడు నన్ను విడిచిపెట్టకు అరుణాచలా! ఈ రమణస్వామిని ఇంటి దగ్గరి నుంచి తీసుకొచ్చాడు, తీసుకొచ్చి వదిలేసాడు అని నిన్ను అందరూ తిట్టిపోస్తారు! తీసుకొచ్చిన వాడివి ఎలాగూ తీసుకొచ్చావు, ఇంక నన్ను విడిచిపెట్టకు అరుణాచలా! నేను ఎంతటి వాడిని నిన్ను పట్టుకోవటానికి; నువ్వే నన్ను పట్టుకోవాలి. నన్ను విడిచిపెట్టకు అరుణాచలా! ఒకవేళ నువ్వు విడిచి పెట్టావు అనుకో, లోకం అంతా నిన్ను నిందిస్తుంది. లోకం యొక్క నిందకైనా జడిసి నువ్వు నన్ను విడిచిపెట్టకు అరుణాచలా,అంటున్నాడు రమణస్వామి!

**అరుణాచలశివ అరుణాచలశివ అరుణాచలశివ అరుణాచలా!**

# శ్రీ కృష్ణ భగవానుడు

కృష్ణుడు సంపూర్ణావతారం, లీలావతారం. కంప్లీట్ మానిఫెస్టేషన్ ఆఫ్ డివైన్. కృష్ణుడి రూపం, నామం, చేష్టలు అన్నీ మధురమే, కానీ కృష్ణుడిని అర్థం చేసుకోవటం ఎవరితరం, ఆయన స్వరూపం పొందినవాడు తప్ప! కృష్ణుడి గురించి శ్రీ నాన్నగారి మాటలలో..

కృష్ణుడుమధురలో జైలులో జన్మించాడు; కాని తల్లి కడుపులో నుంచిరాలేదు. మధురలో శ్రీకృష్ణజన్మస్థానంలో గోడమీద కృష్ణుడు ఇక్కడ పుట్టలేదు, పుట్టిన వాడివలె కనిపించాడు అని రాసారు. ఆయన మామూలుగా జన్మించలేదు. నారాయణుడిగా చతుర్భుజాలతోటి శంకుచక్రాలతోటి వసుదేవుడికి దర్శనం ఇచ్చాడు. వసుదేవుడికి వీడు భగవంతుడు అని అర్థం అయ్యింది.

కృష్ణుడి తల్లితండ్రులు అయిన దేవకీవసుదేవులకి కంసుడు అంటే విపరీతమైన భయం ఉండేది. వాళ్లకి పుట్టిన బిడ్డలని అందరినీ అతడు చంపేస్తున్నాడు. కృష్ణుడు పుట్టిన వెంటనే వీడు మన బిడ్డ కాదు, నారాయణుడుగోవిందుడు, అని వసుదేవుడు గ్రహించాడు. మాకు కంసుడి వల్ల విపరీతమైన భయం పట్టుకుంది. ఓ గోవిందా, ఓ నారాయణుడా! మా భయం పోగొట్టటానికి మా కడుపులో పుట్టావా నువ్వు! అంటాడు. మేము ఇంక భయపడము, కంసుడిని చంపటానికి నారాయణుడవు నువ్వు మా కుక్షిలో పుట్టావు అంటాడు వసుదేవుడు.

కృష్ణుడు ఎక్కువగా సంచరించిన ప్రదేశాలు మధుర, బృందావనం, గోకులం. గోకులంలో ఉండగా ఆవులని కాసాడు, గోవర్ధన పర్వతం ఎత్తాడు, కంసుడు పంపిన రాక్షసులని అందరినీ సంహరించాడు. కొందరు మంచివాళ్లే అయినా పూర్వజన్మలలో వారు చేసిన పాపాలవల్ల, శాపగ్రస్తులై బాధపడుతూ ఉంటారు. అటువంటి వాళ్లని అనేకమందిని శాపవిముక్తుల్ని చేసాడు భగవంతుడు. కృష్ణుడు ప్రేమస్వరూపుడు.

బలరామకృష్ణులను తీసుకొని రమ్మని కంసుడు అక్రూరుడిని పంపుతాడు. కృష్ణుడు అక్రూరుడి కూడా వెళ్తుంటే, గోపికలు వచ్చి రథానికి అడ్డుపడతారు. అక్రూరుడిని తిడతారు. నీ తల్లితండ్రులు అక్రూరుడు అని పేరు పెట్టారు కానీ, నువ్వు చేసేవి అన్నీ క్రూరమైన పనులు అన్నారు. గోపికల ప్రేమ ఇంద్రియాలతోటి, మనస్సుతోటి, శరీరంతోటి సంబంధం లేని ప్రేమ. గోపికలకి ఉన్న ప్రేమ భగవంతుడి మీద ఉద్ధవుడికి కూడా లేదు.

కృష్ణుడి బలం ఎటువంటిది అంటే, ఎవరినైనాచంపాలి అనుకొని ఊరికే ముట్టుకుంటే చచ్చిపోతారు, యుద్ధాలు చెయ్యక్కరలేదు. అలాగే కంసుడి దగ్గరికి వెళ్లాడు. కృష్ణుడు ఇంతమందిని చంపేసి వస్తున్నాడు నేను తట్టుకోగలనా అనుకుంటాడు కంసుడు. సింహాసనం

మీద కూర్చుని ఉంటే, ఊరికే జుట్టు పట్టుకొని లాగాడు. అంతే చచ్చిపోయాడు. యుద్ధం చెయ్యటం వల్ల చచ్చిపోలేదు, భయం వల్ల చచ్చిపోయాడు. చాలా మంది భయం వల్ల చచ్చిపోతారు.

కృష్ణుడు చట్టాన్ని గౌరవిస్తాడు. జరాసంధుడు తరుముకువస్తే ఈయన పారిపోయేవాడు. కృష్ణుడు దేవుడు కదా అలా పారిపోతున్నాడు ఏంటి అనుకుంటాము. జరాసంధుడి మరణం వీడి చేతిలో లేదు,భీముడి చేతిలో ఉంది. జరాసంధుడి బాధ పడలేకే ద్వారక నిర్మించాడు.

కృష్ణుడి మాట మధురం, నడక మధురం, వదనం మధురం, ఆయన చేష్టలు కూడా మధురంగానే ఉంటాయి. ఆయన చేష్టలు లీలలు అన్నీ డిఫరెంట్ గా ఉంటాయి, చాలా విషయాలు మనకి అందవు. ఒకోసారి ఆయన అధర్మాన్ని ఆచరించినట్టు మనకి కనిపిస్తుంది. కాని ఇందులో ఒక రహస్యం ఉంది, ధర్మాన్ని స్థాపించటానికే ఆయన అధర్మాన్ని ఆచరించాడు. ఇది తెలిసున్నవాళ్ళు ధన్యులు. పరిస్థితులని బట్టి, ధర్మాన్నిస్థిరపరచటానికి ఉపయోగపడేలా అబద్ధాలు చెప్పాడు కాని, అబద్ధం చెప్పాలని చెప్పటం కాదు.

కృష్ణుడిని వెన్నదొంగ అంటారు. దాని అర్థం ఏమిటంటే వెన్నపూస ఎంత మృదువుగా ఉంటుందో, అంత దయతోటి జ్ఞానం తోటి ప్రేమతోటి నీ హృదయం నిండి ఉంటే నీ మనస్సుని ఆయన దొంగతనం చేస్తాడు అని చెప్పటం. మీ మనస్సుని మీరు చంపుకోలేరు, నారాయణుడు దొంగతనం చేస్తాడు. అంటే మీకు తెలియకుండా మీ మనస్సుని తీసేసుకొని మీకు ఆత్మజ్ఞానం కలగజేస్తాడు. అయితే అందరి మనస్సులూ తీసుకోడు. ఎవరి మనస్సు అయితే వెన్నపూస అంత మృదువుగా, తెల్లగా, స్వచ్ఛముగా ఉంటుందో, ఎక్కడా కల్మషం లేకుండా ఉంటుందో, సత్యంతో నిండిన హృదయం ఎవరికైతే ఉందో, వాళ్ళకే తన స్వరూపం ఇస్తాడు. మీ తెలివితేటలతో సాధన చేసి మోక్షం పొందలేరు. భగవంతుడు మీ మనస్సుని, అహంకారాన్ని, మీకున్న వికారాలని తినేస్తాడు. వాసనాక్షయం అవ్వకుండా మోక్షం కలగదు, కలిగినా నిలబడదు. అంటే ఇక్కడ వాసనాక్షయం ముఖ్యం. రాగద్వేషాలు, కామక్రోధాలు ఉన్నంత కాలం వాసనాక్షయం అవ్వదు.

భారతంలో కృష్ణుడు రాయభారానికి వెళ్తాడు. కృష్ణుడు భగవంతుడు కదా. దుర్యోధనుడు వినడు అన్న సంగతి ఈయనకి తెలుసు. అయినా మన డ్యూటీ మట్టుకు చెయ్యాలి. తరువాత కృష్ణుడు చెప్పలేదు, చెప్పివుంటే వినేవాడేమో అంటుంది లోకం. కృష్ణుడు అంతటి వాడు మంచి పని చెయ్యలేదు అని లోకం నిందిస్తుందని చేసాను అన్నాడు. ఎక్కడో యుద్ధం సమస్యలు కాదు, మన ఇంట్లో సమస్యలు కూడా అంతే. మనం చెప్పవలసిన మాటలు చెప్పాలి. ఒకవేళ వినడు అనుకోండి, వదిలేయండి. మళ్ళీ లోపల ఊరికే పుండు క్రింద పెట్టుకోకండి. వినలేదు వినలేదు అని ఊరికే బాధ పెట్టుకోకండి. అలా బాధ పెట్టుకొంటే

మట్టుకు మళ్ళీ కొత్త సంస్కారాలు ఏర్పడతాయి; అది జ్ఞాపకం ఉంచుకోండి.

నా అనుగ్రహం లేకుండా, నా దయ లేకుండా ఎవ్వడూ మాయని జయించలేడు అని గీతలో పరమాత్మ చెప్పాడు. నా దయ లేకుండా నా స్వరూపాన్ని మీరు పొందలేరు. మీరు నన్ను గౌరవించకపోయినా పరవాలేదు, నన్ను దేహంగా భావించి మనుషులు అందరూ నన్ను అవమానపరుస్తున్నారు అన్నాడు గీతలో. ఒకడు రాయబారి అంటాడు, ఇంకొకడు రథం తోలేవాడు అంటాడు, ఇంకొకడు వెన్నదొంగ అంటాడు, ఒకడు గోపికలతోటి ఆడుకున్నాడు అంటారు.అంటే భగవంతుడిని ఒక దేహానికి పరిమితం చెయ్యటం ఆయనను అవమానపరచటం. మనం దేహానికి పరిమితం అయ్యి ఉన్నాము కాబట్టి భగవంతుడిని దేహానికి పరిమితం చేస్తున్నాము. మీరు ఈ దేహం కాదు, మనస్సు కాదు, ఇంద్రియాలు కాదు, మీరు ఆత్మ అని చెప్పాడు భగవంతుడు.

కురుక్షేత్రంలో కౌరవులకు పాండవులకు మధ్య యుద్ధం జరిగింది. ఒకపక్క కౌరవసేన ఒకపక్క పాండవసేన నిలబడి ఉండగా, మధ్యన భగవంతుడు వాసుదేవస్వామి అర్జునుడికి చెప్పిన శాస్త్రం గీతాశాస్త్రం. ఇది భగవంతుడి ముఖంలోంచి వచ్చిన మోక్ష శాస్త్రం, యోగశాస్త్రం. ఇది కేవలం భారతీయులకే కాదు, ప్రపంచంలో మానవజాతి అందరికీ పనికివచ్చే శాస్త్రం. ఉపనిషత్తులలో ఉన్న సారమే భగవద్గీత; వేదాల సారమే గీత. భగవద్గీత భగవంతుడి చేత చెప్పబడింది. ఆయన వాసుదేవుడి గారి అబ్బాయిగా చెప్పలేదు, ఈశ్వరుడై చెప్పాడు. మీ అందరి హృదయాలలో ఈశ్వరుడు ఉన్నాడు వాడిని శరణు వేడుకుంటే మీకు మోక్షం కలుగుతుంది. లోపల ఉన్న ఈశ్వరుడు మోక్ష ప్రదాత అని చెప్తాడు భగవద్గీతలో. భగవద్గీత నాకు పూర్తిగా అర్థం అయ్యింది అని చెప్పటానికి ఎవడికీ హక్కు లేదు, ఎవడూ సరిపోడు. చదవవచ్చు, అక్కడ సహృదయం ఉండాలి, సద్బుద్ధి ఉండాలి, మానవజాతి మీద ఎంతో కొంత ప్రేమ ఉండాలి, ఆ చదివేవాడు ప్రేమస్వరూపుడై ఉండాలి. వాడు బుద్ధిమంతుడై ఉండాలి, వాడికి కళ్యాణగుణాలు ఉండాలి, ఇన్ని రకాలుగా ఉంటేనే కాని గీత అర్థం అవ్వదు.

మీ ఆత్మగా ప్రకాశిస్తున్న వాసుదేవస్వామిని, ఏ మర్మం లేకుండా, రహస్యం లేకుండా, హృదయపూర్వకంగా మీరు ప్రేమించండి. ఆయన మీ మనస్సుని శుద్ధి చేస్తాడు, మీ బుద్ధిని శుద్ధి చేస్తాడు. మీ బుద్ధిలో ఉన్న వంకర్లు తీసేస్తాడు. మీకు ఎటువంటి బుద్ధిని ఇస్తే ఆత్మ దర్శనమౌతుందో అటువంటి బుద్ధిని వాసుదేవస్వామి మీకందరికీ ప్రసాదిస్తాడు. అయితే మీకు భక్తి ఉండాలి. భయం అంటే ఏమిటో తెలియని వాళ్ళు భక్తిగా ఉండగలరు.

**కృష్ణం వందే జగద్గురుం**

**శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805**

SRI RAMANA KSHETRAM A/c. No. **6794857762**

**INDIAN BANK, VEDANGIPALEM BRANCH**

IFSC Code : **IDIB000V142**

# శ్రీకృష్ణాష్టమి

ప్రతీ సంవత్సరం శ్రావణమాసం, అష్టమి తిథి రోహిణి నక్షత్రం రోజున, శ్రీకృష్ణ జన్మాష్టమిని జరుపుకోవడం సంప్రదాయంగా వస్తోంది. లోకకల్యాణం నిమిత్తం, స్వయంగా పరమాత్మే ఈ భూమిపై అవతరించినరోజు శ్రీకృష్ణాష్టమి. యావత్ సృష్టికి పండుగరోజు. కృష్ణుడు కాలాతీతుడు, పూర్ణబ్రహ్మము కాబట్టి, పుట్టినరోజు అనేమాట ఆయనకు వర్తించదు కానీ, కృష్ణుడు దేహం ధరించినరోజు మనకు ఎంతో పవిత్రమైనది. అణువు కన్నా చిన్నవాడు, ఈ సకల చరాచర సృష్టి కన్నా పెద్దవాడు, అయిన పరమాత్మ ఈ భూమిపై అవతరించి, భగవద్గీత ద్వారా దేశ, కాల, కారణాలకు, అతీతమైన దివ్య జ్ఞాన బోధను మానవాళికి అందించాడు. కృష్ణుడు అంటే ఆదిమధ్యాంతరహిత ఉనికి. సచ్చిదానంద స్వరూపుడు. సకల జీవుల హృదయాంతరాళములందు బుద్ధికి, సాక్షిగా వెలుగునట్టి ఆత్మయే, కృష్ణుడు. 'కృష్ణ' శబ్దం చాలా మధురమైనది కారణం అది నిర్గుణ తత్త్వం, ఆనంద తత్త్వం. కృష్ణుడు వాసుదేవుడు. వాసుదేవా! అని స్మరిస్తే అనేక జన్మల నుండి వచ్చే వాసనలను హరించి, స్వరూపశాంతిని ప్రసాదిస్తాడు. పార్థుడికి తత్త్వసారాన్ని బోధించి పార్థసారథి అయ్యాడు. అర్జునుడి రథాన్ని నడిపి రథసారథి అయ్యాడు. అదేవిధముగా ఎవరైతే కృష్ణుడిని ఎన్నుకుంటారో, వారందరికి ఆయన సారథి అవుతాడు. మనము జనన-మరణ సంసారచక్రం నుండి విడుదల పొందాలంటే కృష్ణుడి సారథ్యాన్ని కోరుకోవాలి. "అనన్య చిత్తముతో నిరంతరం నన్ను ధ్యానించు పుణ్యశీలుర యోగ, క్షేమములను నేనే వహింతును" అని చెప్పియున్నాడు పరమాత్మ! అట్టి జగద్గురువు శ్రీకృష్ణపరమాత్మ ఆశీస్సులు మనందరికీ ఉండాలని ప్రార్థిద్దాం!

**ఓం తత్ సత్**

**(ది॥ 11-08-2020 శ్రీకృష్ణాష్టమి సందర్భంగా)**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

## ప్రభుత్వ కఠిన నిబంధనలను పాటించి కరోనా కంటిలో కారం కొడదాము

వీరబ్రహ్మంగారు, నాస్త్రోడామస్, రామచంద్ర మిషన్ అధ్యక్షులు రామచంద్రుడు వంటి వందలమంది చెప్పిన కాలజ్ఞానం ఫలితాలు నేడు చవిచూస్తున్నాము. ప్రకృతి మనుషులు భయపడిపోతున్నారు కాని ధార్మికులు నిజభక్తులు వ్యాకులము పొందరు. ఈశ్వర నిర్ణయం ఎలా జరగాలో అలా జరుగుతుందని నిశ్చలంగా ఉంటారు. నిశ్చల స్థితే జీవన్ముక్తి అన్నారు శంకర భగవత్పాదులు. భగవాన్ సమక్షంలో రెండవ ప్రపంచ యుద్ధం జరుగుతోంది అని వ్యాకులతతో వ్యక్తం చెయ్యగా భగవాన్ "నీవు ఆపగలవా?" అన్నారు. "అది ఎంత కాలం ఉంటుందో, దాని ఫలితం ఎలా ఉంటుందో అన్నీ వారికి తెలుసు. వారే బలవత్తరమైన శక్తి ఒకటి పనిచేస్తున్నది, దానికి అన్నీ తెలుసు అది ఎలా చెబితే అలా నడుచుకో" అంటూ ఎలా బ్రతకమంటారు అనగా "చచ్చిన వాని వలె బ్రతుకు" అన్నారు. అంటే ప్రతీదానికి హైరానా పడకు అని అర్థం. వివేకానంద "పిరికి వాడు రోజూ మరణిస్తాడు, ధైర్యవంతుడు ఒకసారే చనిపోతాడు" అన్నారు. జె.కె. "చావు అంటే ఒక జోకు" అన్నారు. భౌతిక దేహం పంచభూతాల్లోను కలసిపోతుంది. సూక్ష్మశరీరం భౌతిక అగ్నికి కాలదు, మరో జన్మకోసం వెతుకుతూ తిరుగుతుంది. ఏదో ఒకచోట శరీరాన్ని తొడుగుకుంటుంది చావులేని వస్తువు. ఆత్మలము మనం, మనం ఎక్కడ చస్తాము, ప్రస్తుత సంకట స్థితికి మనిషి స్వార్థమే కారణం. జనాభా విపరీతంగా పెరిగింది. ఫ్యాక్టరీలు వదిలే విషవాయువు వల్ల ఆక్సిజన్ అందించే అడవులు నరికివేత, అడవులు అంటుకొని నాశనమవుతున్నాయి. విషపూరితమైన రసాయనాలు నదులలో కలవటం, భూగర్భజలాలు కూడా కలుషితం కావటం, మహానగరాలు వదిలే మురికి, గంగ - గోదావరి వంటి నదులలో నీరు త్రాగునీటికి ఉపయోగంలేని స్థితి మానవజాతి పూనుకుంది. ఇది మోపియ వంటి దేశంలో ఆకలి చావులు పేద శ్రమతో సంపన్నులైన ఫ్యాక్టరీ యజమానులు, సంపదను వెయ్యి రెట్లు పెంచుకొంటున్న కొద్దిమంది మానవతా దృక్పథంలో ఉదారతను చూపుతున్నారు. అరబ్ దేశాలు డబ్బు ఏమి చేసుకోవాలో తెలియక పేదలను కట్టుబానిసలుగా చేస్తున్నారు. ధరిత్రి కన్నీటి కడలిలో జీవిస్తున్నది. పాపాలు పెరిగిపోయాయి. 'దోచుకో-దాచుకో' వంటి కుహనా నాయకులు బయలుదేరి సమాజాన్ని పీడిస్తున్నారు. మానవజాతి మనుగడేకాదు వన్యప్రాణుల గతి అంతరించే పరిస్థితి దాపురించింది. ఈశ్వరునికి తెలియకుండా భూకంపాలు, సునామీలు రావు. అవి ఎప్పుడు ఎక్కడ కూలంకషంగా కాలజ్ఞానంలో తెలియబడింది. శ్రీనాన్నగారు ఒక ఆంతరంగిక భక్తులతో "రెండు మూడు సునామీలు వచ్చాక పెద్దది వస్తుంది. పాలకొల్లు గోపురం ఎక్కినా ఎవరూ మిగలరు" అన్నారు. ఈ భూప్రళయంలో నాలుగింట మూడొంతులు మరణిస్తారు. భక్తులు మాత్రం మిగులుతారు. తదుపరి వెయ్యి సంవత్సరాల వరకు సుఖజీవనం సాగిస్తారు. ఇది అంతా ఈశ్వర ఆజ్ఞతో చేసే ప్రకృతి కార్యం. దానికి తిరుగులేదు. "మార్పు సహజం" అంటారు పెద్దలు. వేదం చెబుతున్నది - "నారాయణం పరబ్రహ్మం సర్వకారణ కారణం. ఇది భక్తుల నరనరాలలోను జీర్ణించుకొని నిశ్చలంగా ఉంటారు. ప్రతీ ఉపద్రవం అర్థరాత్రే వస్తుంది కబీర్" రేపు చెయ్యవలసిన పని ఈరోజే చెయ్యి, ఈరోజు చెయ్యవలసింది ఇప్పుడే చెయ్యి క్షణంలో ప్రళయం రావచ్చు" అంటారు అంటే గురు స్మరణ మానకు. అంతే.

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం, సెల్ : 9491968966